నేను, ప్రజలు, ప్రపంచం

(పిఠాపురం యువరాజా స్వీయచరిత్ర)

మూలం

ఆర్.వి.ఎం.జి. రామారావు

స్వేచ్ఛానుసరణ

గౌరవ్

ప్రచురణ

పిఠాపురం పీపుల్స్ ఇనీషియేటివ్

యువరాజా స్వీయ చరితా సౌరభం

గడచిన ప్రతి ఒక 'నిన్న'
వాడిన ఓ పొగడపూలదండ.
వీడని స్మృతుల పరిమళం దానినిండా

'రేపు'
ఓ స్వప్నాల స్వాతిచిప్ప
ఏదరి చేరేనో తెలియని పూలతెప్ప.
'నిన్న' మొన్నటికి రేపు.
రేపు రేపటికి నేడు
ఈ దినాల పరుగుల పరవళ్ళు
ఎపుడు ఎవరు అవుటవుతారో తెలియని చెడుగుళ్ళు.

'నేడు'
ఓ అందిన ద్రాక్ష
దాని సద్వినియోగమే కావాలి
మానవుని దీక్ష
ఆ దారిని సాగిపోయే
బాటసారి ఏక్‌తార ఈ తత్వాన్నే పాడుతుంది.
ఆ దక్షిణ దిక్కున కాలే కట్టె
ఈ సత్యాన్నే పుటం వేస్తుంది.

ఉన్న నాలుగు నాళ్ళు వెలిగే ప్రాణదీపం కిరణాల కుంచెతో చిత్రించే సుఖదుఃఖాల, ఆశనిరాశల, అనుబంధాలు తెగదెంపుల, పొగడ్తలు తెగడ్తుల ఆరోహణ అవరోహణల చిత్ర విచిత్రాల చిత్రశాల జీవితం.

జీవిత చరిత్ర వ్రాసుకోవడమంటే అన్ని విలువల వలువలను స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా, నిర్భయంగా విదిలించుకొని తన్ను తాను నగ్నంగా ఆవిష్కరించుకొనే ఓ సాహస సాహితీ ప్రక్రియ. ఓ సజీవ క్రతువు. మంచి చెడులను సమధర్మంగా విచక్షణా విశ్లేషణతో సమవర్తిగా నిర్వహించే ఓ పవిత్ర యజ్ఞం – అది ఓ గాంధీకి, ఓ వీరేశలింగానికి, ఓ చలానికి, ఓ సోమసుందర్ వగైరాలకు మాత్రమే సాధ్యమైంది. ఇపుడు మన పిఠాపురం యువరాజావారి జీవిత చరిత్ర చదివితే ఇది కూడా ఈ కోవకే చెందినదే అనిపించడంలో ఎటువంటి సందేహం లేదు.

ఒకసారి హైద్రాబాద్ త్యాగరాయ గాన సభ వేదిక మీద సాహితీ సభలో కృష్ణశాస్త్రిగారి మేనకోడళ్ళు సీత, అనసూయలలోని అనసూయగారు మాట్లాడుతూ "నా జీవితంలో అనేక ఆనందాలు అద్భుతాలు మంచి చెడుల కలబోతలున్నాయి. వాటిని గ్రంథస్తం చేసే సాహసం, తెగింపు లేక జీవిత చరిత్ర వ్రాయలేకపోతున్నాను. అది నిరంతరం నన్ను బాధపెడుతూనే ఉంది" అన్నారు.

సోమసుందర్ గారి యింట్లో ఓసారి ఆయన జీవిత చరిత్ర "కలలు-కన్నీళ్ళు" గురించి సమాలోచన జరుగుతున్నపుడు ఆయన కొడుకులలో ఒకరు చాలా చిరాకుగా కోపంగా.. "మీ అనవసరపు స్త్రీ సంబంధాలన్నీ పేర్లతో సహా పుస్తకానికెక్కించి మీ పరువు, వాళ్ళ పరువు, మా పరువూ కూడా మంటకలిపారు, అవేమన్నా అంత ఘన కార్యాలనా పుస్తకాన్నికెక్కించా"రన్నాడు. ఆయన చాలా కూల్‌గా, చిన్న చిరునవ్వుతో "గొప్పవే వ్రాసుకుని, తప్పులను దాచుకొంటే అది జీవిత చరిత్ర ఎందుకవుతుంది? పొగడ్తల దండకమవుతుంది – మీరింత మంది నా జీవిత మంచి చెడుల గురించి ఇలా బాహాటంగా స్వచ్ఛందంగా స్వేచ్ఛగా విమర్శిస్తూంటే నా రచన సఫలమైనట్టే. నాకు చాలా ఆనందంగా వుంద"న్నారు.

పిఠాపురం యువరాజా రావు వెంకట గంగాధర రామారావుగారు వారి స్వీయచరిత్రను "Of Men, Matter and Me" అని ఆంగ్లంలో ప్రచురిస్తే దానిని, పిఠాపురపు ఆధునిక విజ్ఞాన విప్లవ భావ వీచికల హేతువాది, కార్యశూరి శ్రీ గౌరవ్ తన రచనా నైపుణ్యాన్ని, అనువాద సామర్థ్యాన్ని అడుగడుగునా ప్రదర్శిస్తూ **"నేను, ప్రజలు, ప్రపంచం"** పేరున తెనుగనువాదం అద్భుతంగా చేసాడు.

యువరాజా వారి జీవితం ఎన్నెన్నో అద్భుత సంఘటనల, సంక్లిష్ట సంఘర్షణల అపూర్వ అపురూప విషయాల, విశేషాల సమాహారమైనప్పటికీ, గ్రంథస్తం చేసేటపుడు చాలా చాలా సంక్షిప్తంగానే రచన ముగించారు. ఇంకాస్త వ్రాస్తే బావుండుననే భావనానుభూతిని కలిగించడం ఉత్తమ రచన ప్రథమ లక్షణమంటారు. ఈ గ్రంథం చదివిన వెంటనే కలిగే మొదటి ఫీలింగ్ అదే – ప్రశంసలు పొందిన రచనా సామర్థ్యంతో ఎన్నో కావ్యాలు, నాటికలు, వ్యాసాలు, ప్రయోగ రచనలు గావించిన ఆయన, జీవిత రచన దగ్గర పురి విప్పిన నెమలి కావలసిన వారి హృదయం పొదుపును మూటగట్టి, సంక్షిప్తానికే నిక్షిప్తమయ్యింది. కృష్ణశాస్త్రిగారు చెప్పే పిఠాపురపు జమీందారీ వారసత్వపు బద్ధకమో...? అలసత్వమో...?? తెలియదు.

జీవిత గ్రంథాన్ని చాలా కొద్దిపాటి పేజీలకే పరిమితం చేసినా ఆయనలోని నిఖచ్ఛితనం, ధిక్కారస్వరం, స్వేచ్ఛా ప్రియత్వం, ఏమాత్రపు మొహమాటం దాపరికంలేని నిర్భయ భావ ప్రకటన అడుగడుగునా మనలను ఆశ్చర్య పరుస్తుంది. ఆనంద పరుస్తుంది. ఆనాటి వారి రాచరికపు జీవితాన్ని, బాల్యం నుంచి భరణాల రద్దు వరకూ... రాచరిక పాలన నుండి ప్రజాస్వామ్య ప్రభుత్వ పాలన వరకూ సాగించిన రచనలో రాచరికపు భవనాల తెర వెనుక భాగోతాన్ని తక్కువ మాటలలోనే తళుక్కుమని మనసుకు హత్తుకొనే రచనా చమత్కృతితో చెప్పిన తీరు ఫోటోస్నాప్‌ల్లా వెలుగుల మెస్మరిజంతో చదువరులను ఆనంద చకితులను చేస్తుంది.

అధునాతన సౌకర్యాలతో విలాసవంతంగా వుండే లంకంత కోటలో అమ్మానాన్నల ప్రేమాభిమానాలు ఎంతగా వున్నా వారి నియంతృత్వపు క్రూరత్వం ఆనందాన్ని హరించి బాల్యం బ్రతుకు బంగారు పంజరమైందని బాధ పడతారు. ఇంట్లోంచి పారిపోవాలనిపించింది గాని, ధైర్యం చేయలేక పోయానంటారు.

మహారాజావారు గొప్ప మానవతావాదని, గొప్ప అనాధ శరణాలయం కట్టించి, అనాధలను సొంత పిల్లల్లా ప్రేమాభిమానాలతో చూచేవారని, అక్కచెల్లెళ్ళు, అన్నతమ్ముళ్ళ వరుసతో పిలిచేవారమని చెపుతారు.

ఓ మంచి శుభోదయంలో, పక్షులు కిలకిలా రావాలతో, పూల పరిమళాలతో ఆనందదాయకంగా వున్న ఆహ్లాదకర వాతావరణంలో కూర్చుని మేష్టారుతో పాఠాలు చెప్పించుకుంటున్న యువరాజుని రవీంద్రనాథ్ టాగోరు చూచి "ఇంత క్రూరత్వం, హింసా ఈ వేళలోనా!" అని మహారాజావారిని కబురు చేసి, పాఠాలు రద్దు చేయించారట. ఆ ఒక్కరోజు ఆయన ప్రకృతి నుండి తెలుసుకున్నది, నేర్చుకున్నది విశ్వవిద్యాలయంలో ఒక సంవత్సరంలో నేర్చుకున్న దానికంటే ఎక్కువ అంటారు.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చదువుకోవాలన్న తన కలను తన పెద్ద కుమారుని ఆక్స్‌ఫర్డ్‌లో చదివించి, నెరవేర్చుకున్నానంటారు.

ప్రేమించినమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకున్న వారి కోరికను తల్లిదండ్రులు థర్డ్ డిగ్రీ వుపయోగించడం వల్ల విరమించుకుని వేరే వివాహం చేసుకున్నట్లు చెపుతారు.

ప్రయాణాలంటే ఆయనకు చాలా సరదా అని తన వివాహానంతరం భార్యతో కలసి, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, సోదరిలతో కలసి నెలల తరబడి ఈజిప్టు, ఇంగ్లాండు, అమెరికా, జర్మనీ, స్వీడన్, స్విట్జర్లాండ్, ఇటలీ, ఫ్రాన్స్ వగైరా దేశాలు తిరిగి ఆనందించినట్లు వ్రాశారు.

ఆయన భార్యతో కలసి సబర్మతీ ఆశ్రమంలో గాంధీగారిని కలసి ఐదు రూపాయలు చెల్లించి ఆటోగ్రాఫ్ తీసుకున్నట్లు ఇంగ్లీషులో ఆటోగ్రాఫ్ చేస్తే ఏడు రూపాయలు వసూలు చేసేవారని, ఈ ఎమౌంట్ హరిజన సేవా సంఘానికి పంపేవారని వ్రాసారు.

జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొని నెహ్రూ, రాజాజీ, విజయలక్ష్మి పండిట్, సరోజినీ దేవి వగైరాలతో రాజకీయ సంబంధాలు, పార్లమెంట్‌కు ఎన్నుకొనబడటం, తరువాత తరువాత స్వార్థం అవినీతి, బంధుప్రీతి రాజకీయాలతో విసుగెత్తి రాజీనామా చేయడం కూడా జరిగింది.

అతిథుల్ని మహారాజుల్లా చూసుకుని అలవికాని సత్కారాలు చేస్తాననే పేరు గడించానని, ఆయన ఏర్పాటు చేసిన పార్టీలకు సంబంధించిన విశేషాలు వార్తా పత్రికలలో ప్రముఖంగా ఫోటోలతో ప్రచురితమయ్యేవట. ఈ సందర్భంగా మన పిఠాపురానికి చెందిన పెదిరెడ్డి సుబ్బారావు అనే ఆయన చెప్పిన ఓ సంఘటన చెప్పుకోవాలి. పెదిరెడ్డి సుబ్బారావుగారు మద్రాసులో పిఠాపురం మహారాజా వారి దగ్గర పనిచేసేవారు. యువరాజావారు ఒకసారి బరోడా మహారాజావారిని మద్రాసుకి సరదాగా విందుకి ఆహ్వానిస్తానన్నారట. అనవసరపు డబ్బు ఖర్చుని అంగీకరించని మహారాజావారు వద్దన్నారట. యువరాజా వారి యువరక్తం మహారాజా వారిని కాదని బరోడా మహారాజాని ఆహ్వానించారు. ఆయన మందీ మార్బలంతో ఓ ట్రైన్‌లో వచ్చారు. ట్రైన్ ట్రైన్ అంతా బుక్‌చేసి రానూపోనూ ఖర్చులు యువరాజావారివే నట! ఇది కాక, బరోడా మహారాజా వారికి, వారి వాళ్ళకి ఆ రోజులలో మద్రాసులో ప్రఖ్యాతి అయిన కన్‌మెరా హోటల్ మొత్తం బుక్‌చేసి, మద్రాసు సెంట్రల్ స్టేషన్ నుండి రెడ్ కార్పెట్ స్వాగతంతో, ఓ మహోత్సవమే జరిపారు! యువరాజావారి గొప్ప ఆతిథ్యాన్ని రెండురోజులు హాయిగా ఆనందించి, అభినందించి బరోడా రాజుగారు వెళ్ళిపోయారు. కొసమెరుపు యువరాజావారు ఎంతో ముచ్చట పడి కట్టించుకున్న 'వసంత శోభ'నే అధునాతన బిల్డింగ్‌ను అమ్మి కన్‌మెరా హోటల్ రెండు రోజుల బిల్లును చెల్లించారట!

వర్షంలో తడుస్తున్న ఓ వృద్ధుడికి తన రోల్స్‌రోయిస్ కారులో లిఫ్ట్‌ఇచ్చి, ఇంటికి చేర్చడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని అలా చాలా సార్లు చేసానని వారి మానవత్వాన్ని చాటారు. ధనవంతులతో కార్లలో విలాసవంతంగా తిరగడం కంటే ఇది మంచి పనే కదా అంటారు.

ఓరోజు ఏదో సినిమా చూచి వస్తున్న సమయాన గాంధీగారిని ఎవరో తుపాకితో కాల్చి చంపినట్లు తెలిసి, ఎంతగానో వెక్కివెక్కి ఏడ్చినట్లు వ్రాసుకున్నారు. పెళ్ళి ఓ బందిఖానా

అని, ఒక భార్య ఓ భర్త జీవితాంతం కట్టుబడి ఉండటం అనేది ఒకరిని ఒకరు మోసం చేసుకోవడమని, ఇది దుర్మార్గమని స్వేచ్ఛ ప్రణయాన్ని అభిలషిస్తారు.

బాధలూ యిబ్బందులలో ఓ నిర్ణయానికొచ్చిన మనిషికి ఆత్మహత్య చేసుకొనే చట్టం కల్పించాలన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. మద్యపానాన్ని ఆనందించే ఆయన, నిషేధాన్ని వ్యతిరేకించారు.

యువరాజుగా ఎంతో విలాసవంతమైన ధనిక జీవితాన్ని అనుభవించి, ఆనందించినాయన రాజ భరణాల రద్దుతో, తండ్రి, సోదరితో కోర్టు లావాదేవీలతో మొత్తం ఆస్తిని పోగొట్టుకుని సామాన్య బ్రతుకు దుర్భరం కావడంతో చాలా లేమి బాధలు పడ్డారు. ఇది చదువుతున్న మనకు కళ్లు చెమ్మరిల్లక మానవు. అంత బాధలలో వైరాగ్యం ఆయనకు శరణ్యం ఓదార్పు అయ్యాయి.

ఆయన అంటారు కదా – ఒక చైనా తత్వవేత్త అన్నాడట, ఎవరికీ కూడా తీర్చబడని కష్టం; పూడ్చబడని నష్టం వుండవట. ఒకవేళ వుంటే. దేవుడే సాయం చేస్తాడట.

"ఉన్న దానిపై ఆశలేనపుడే అది పోతుందన్న భయం వుండదు. ఆశపడే అవకాశమే లేకపోతే ఇక ఆశించే అవసరం వుండదు. సోమరిగా సంతోషాలు. సంచారిగా ఆలోచనలు. ఇవే నాకు మిగిలిన స్మృతులు, బుద్ధుడికి దీక్షా వస్త్రాల్లాగ."

''జీవితం ఎలా వచ్చిందో అలా స్వీకరించాను. అలాగే పోరాడాను. చేయగలిగినపుడు స్వారీ చేసాను. లేనపుడు ఎదురు దెబ్బలు తిన్నాను. దెబ్బలంటూ తిన్నాక బాధ కలుగుతుంది. ఇప్పుడు ఆ నొప్పికి కూడా అలవాటు పడ్డాను"

ఇది ఓ పండిన జీవితం పంచిన జీవిత సత్యామృతం. అనుభవాలకు అక్షర రూపమిచ్చి గ్రంధాన్ని చేసిన జీవిత సౌగంధం. మరుగున పడిన ఈ మహానీయ జీవిత రచనను మనముందుంచిన మన గౌరవ్ ఎంతైనా అభినందనీయుడు – అసాధారణ కార్యశూర్యుడు కూడా. నిజానికి గౌరవ్ అనువాద చాతుర్యం, అభివ్యక్తి సత్తా తెలియాలంటే ఈ రచన ఆంగ్ల ప్రచురణ ఒక పేజీపైన ప్రక్కపేజీని అనువాద ప్రచురణ జరిగివుంటే, టూ ఇన్ ఒన్ – జోడి గుర్రాల ఆనంద సాహితీ స్వారీ అయ్యేది. కానీ చాలా కాస్టీకాంక్ష కదా!

శుభం భూయాత్

పిఠాపురం,
29-2-20

డా॥ సీతా రామస్వామి
మేకా మన్మధరావు

అనువాదకుడి మాట

దాదాపు పన్నెండేళ్ళ క్రితం చదివి అప్పట్లో సగం చేసి ఆపేసిన అనువాదం ఇది. ఇప్పటికి పూర్తయ్యింది. తర్వాత నాకు ఈ మూలగ్రంథం ఇచ్చిన పెద్దమనిషి నా తెలుగు అనువాదం అద్భుతంగా ఉందని పొగిడి మౌనం దాల్చాడు. కొద్దిరోజుల్లో ఇస్తానని పుస్తకం తీసుకున్నాయన మళ్ళీ నా చేతులోకి రాకుండా జాగ్రత్త పడ్డాడు. ఇన్నేళ్ళ నుండీ ఇంగ్లీషు ప్రతికోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను. పిఠాపురం రాజవంశానికి చెందిన ఒకాయన ఏదో శుభకార్యంలో కలిస్తే ఆయన్ని కదపగా, "అసలలాంటి ఆత్మకథ యువరాజు బాబు రాసినట్టే తెలియదన్నా"రు. మొత్తానికి ఆశలొదులుకున్న సమయంలో మిత్రుడు అమర్ ద్వారా ఢిల్లీలో తన మిత్రుడు అభినవ్ స్నేహితురాలు ఒకామె ద్వారా అక్కడ ఆంగ్లమూల ప్రతి లభ్యమౌతే రెండేళ్ళ క్రితం ఢిల్లీ నుంచి నేనే జిరాక్సు ప్రతి తెచ్చుకున్నాను. అప్పటినుండి పనుల ఒత్తిడి కారణంగా తెలుగు చేయడం కుదరలేదు, తర్వాత చేయాలనుకోలేదు.

నిజానికి ఇప్పుడు చదూతుంటే ఏమంత గొప్ప గ్రంథంగా అనిపించకపోగా వ్యక్తిగతంగా అభ్యంతరాలు కూడా నాకు కనబడ్డాయి. మహిళల విషయంలో కరడుగట్టిన పురుషాధిక్యతా, చులకన భావం ఉన్నట్లు తోచింది. స్త్రీల పట్ల గల ఈ గ్రంథకర్త వైఖరిపై విసుగొచ్చి మధ్యలో అనువాదం ఆపి పక్కనపడేసాను. ఐతే కొన్ని అనుభూతులు ముందుకు నెట్టాయి. ఈరోజు నేనేదైతే దృక్పథంతో ఉన్నానో దానికి కచ్చితంగా విరుద్ధమయినది ఈ ప్రయత్నం. అణగారిన ప్రజల గురించో, ప్రజా ఉద్యమాల గురించో, సామాజిక స్పృహని అందించడానికో రాసింది కాదు. ఎక్కువ భాగం జమిందారీ కులీన వర్గాల విలాసాలు, కాలక్షేప కబుర్లు, యువరాజుగా ఆయన అనుభవాల చిత్రణ మాత్రమే ఇది. జనం సొమ్ముతో జల్సాగా గడిపిన జమిందారు కథ తెలుగు చేయడం అనవసరమని చాలాసార్లు అనిపించింది.

అయితే ఇది కేవలం ఆయనకి సంబంధించింది మాత్రమే ఐతే నాకు ఆసక్తి లేకపోను. వ్యక్తిగా ఆయన బలహీనతల మాటున బలమయిన ధిక్కారస్వరం ఉంది. ప్రపంచంలో అనేక విలాసాల్ని విజయాల్ని నమోదుచేసిన తిరుగులేని ధనవంతుడు అంతిమంగా జీవితంలో మానవ విలువల ప్రాధాన్యతను గుర్తించి మానవత్వం ముందు మోకరిల్లడం ఉంది. సర్వత్రా ధనం మూలం ఇదం జగత్తని నమ్మిన వ్యక్తి, జీవితంలో సంతృప్తిని మించిన సంపద లేదనే సత్యాన్ని గ్రహించడంలో చేసిన అన్వేషణ తాలూకు అంతర్మథనం ఉంది. అన్నింటికీ మించి 'పిఠాపురం' ఉంది. అవడానికి భౌగోళికంగా

చిన్న ఊరే కావచ్చు కానీ ఒక్కసారి పరిచయం అయినవార్ని ఆప్యాయంగా తనలో ఇముడ్చుకునే భావోద్వేగభరిత చరిత పీఠికాపుర ఘనత. సంఘ సంస్కరణోద్యమం మొదలుకొని వివిధ అంశాల్లో నాటి పీఠికాపుర ఆస్థాన ప్రస్థాన ఛాయలు నేటికీ ప్రస్ఫుటంగా కనబడతాయి. ఒక అరాజకవాదిగా నిరసిస్తూనే కొద్దోగొప్పో ప్రజాస్వామ్యవాదిగా మెలిగిన ఇందులోని వ్యక్తికి సంబంధించిన కథనాన్నిలా తెనిగీకరించాను. అందుకే ఈ అనువాదం ఒక అద్వైతం.

అనువాదం చేసే క్రమంలో మూలంలో కొన్ని పొరపాట్లు కనిపించాయి. దసరా పండుగ రామరావణ యుద్ధం సందర్భంగా చేసుకునే పండుగ అని రచయిత రాశారు. అయితే, వీటిని అధిగమించేది రచనలోని నిజాయితీ, ముక్కుసూటితనం, అనుకున్నది అనుకున్నట్లుగా చెప్పగలిగే ధైర్యం. ఆంగ్ల ప్రభుత్వాన్ని నిరసించినా, కమ్యూనిజాన్ని సమర్థిస్తూ వివాదాస్పద వ్యాసం రాసినా, జమిందారీ రద్దుకు మద్దతు ఇచ్చినా, మధ్య నిషేధాన్ని వ్యతిరేకించినా, దేశ విభజనను సమర్థించినా, ఆత్మహత్య చట్టబద్ధం చేయాలని వాదించినా అన్నింటా ఆయనలోని ఆ తిరుగుబాటు స్వభావమే అంతర్లీనంగా మనకు కనిపిస్తుంది.

దేశంలోని మానవతావాదులందరినీ ఆదరించిన వారసత్వం ఒకనాడు ఈ నేలనుండేదనే భావనతో ఈ భారాన్ని నెత్తినేసుకోవల్సి వచ్చింది. ఆర్థికంగా, హార్థికంగా ఏమాత్రం కూడదీసుకోలేని ప్రస్తుత పరిస్థితుల్లో దీని అనువాదాన్ని నేను ప్రయత్నించి చేయడం నాకే వింతగా ఉంది. అనవసరమనీ, అతిగా ఉన్నాయని తోచిన అనేక అంశాలను అనువాదంలో మినహాయించాను. అవసరాన్ని బట్టీ కొన్నిచోట్ల స్వతంత్రించాను. అయిష్టంగా చేసినా అన్యాయంగా చేయలేదని చెప్పగలను. మూలంలో నాకు నచ్చనిచోట్ల అక్షరాలపై అయిష్టతని పిఠాపురంపై ప్రేమ ప్రక్షాళన చేసింది. అనువాదంలోని లోపాలకూ, వాక్య సమన్వయ దోషాలకు నాదే బాధ్యత. చరిత్రకి సంబంధించీ ఆసక్తితో కచ్చితమయిన ప్రజాప్రయోజనం కోసమేకానీ ఈ కృతికి మరే విధమయిన కారణమూ లేదు, ఇదిలా ప్రచురించడానికి సలహకరించిన వారందరికీ ధన్యవాదాలు. సెలవు.

ముందుమాట

ఆర్.వి.ఎమ్.జి. రామారావుగారు నన్ను ఈ గ్రంథానికి ముందుమాట రాయాల్సిందిగా కోరారు. ఆ గౌరవానికి నాకు సంతోషం. ఈ గ్రంథకర్త గత 14 ఏళ్ళుగా నాకు మంచి మిత్రులు. ఆయన వ్యక్తిత్వంలోని భిన్న పాశ్వాలు నాకు పరిచితం. ఆయనో కవి, సున్నిత మనస్కుడు, మృదు స్వభావి, సంతోషాన్నీ – సహానుభూతినీ సమంగా పాటించగల ప్రజాస్వామికవాది. ఇంకా ఆయనో తిరుగుబాటుదారుడనే విషయం ఈ పుస్తకంలో తెలుస్తుంది. పిఠాపురం యువరాజుగా ఆయన నాకు పరిచయం అయ్యేనాటికి పిఠాపురం అనేది నా మట్టుకు నాకో ఊరిపేరు మాత్రమే. కానీ తర్వాత నా మిత్రుడి ద్వారా, ముఖ్యంగా ఇప్పుడు ఈ గ్రంథం ద్వారా ఆ పేరు నా ఊహల్లో ఊపిరి పోసుకుంది. అధికారికంగా జీవనోత్తేజంతో నా మిత్రుని ధిక్కార స్వరంలో వెలుగొందింది. రాజరికాన్నీ, ప్రజాస్వామ్యాన్ని స్వయంగా అనుభవించగల ఆయన తప్పా మరెవరు ఈ విషయాల్ని ఇంత సాధికారకంగా రచించగలరు? యువరాజుగారి తండ్రి, అంటే పిఠాపురం మహారాజా గారితో మొదలయిన ఈ గ్రంథం నెహ్రూ భారతదేశంతో ముగిసింది. ఈ మొత్తం చారిత్రక మార్పు క్రమాన్ని గురించిన ఆకర్షణీయ, గాఢమయిన చిత్రణ ఇందులో కనిపిస్తుంది. మానవీయ అనుభూతుల్నీ, మానసిక అభివ్యక్తుల్ని మానవసంబంధాల వేదనలతో మేళవించి రచించడం జరిగింది. ఒక ఆత్మకథని అద్భుతమయిన అద్వితీయ గ్రంథంగా మలచడానికి ఇంతకంటే కావల్సిందేముంది? కనుకనే ఈ స్వీయచరిత్రని చదువుతూ అవ్యక్తమయిన ఆనందాన్ని నేను పొందాను.

చారిత్రకోపన్యాసకులు **– హెచ్.ఆర్. ట్రివర్ – రోపర్**
మెర్టన్ వీధి, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, ఇంగ్లాండ్.

మున్నుడి

ఇదొక ఇచ్చ. పాదార్థిక సత్యం దీన్ని భౌతిక ఉద్రేకమంటుంది, భావోద్రేకం స్ఫూర్తంటుంది. కానీ కచ్చితంగా చెప్పాలంటే ఇదో దురద. ఈ గ్రంథ రచనకి అదే కారణం, అందుకు ఇదే నా క్షమాపణ కూడా.

ఇది విఖ్యాతినొందచ్చు లేదా విమర్శలపాలు కావచ్చు. కానీ ఇదో ఇచ్ఛని తృప్తి పరుస్తుంది. ఏ కార్యక్రమానికయినా అదే ప్రధాన కారణం. అనేక విషయాల్లో 'నేను' అనే అహమే మనందరికీ అప్రకటిత ప్రేరకం. ఈ 'నేను' అను భావనే అంతిమంగా మానవాళిలోనూ, పదార్థంలోనూ ప్రతిబింబిస్తుంది. విభిన్న వర్ణాల్లో వికసిస్తుంది.

అవడానికి ఇది ఒక వ్యక్తి కథే కావొచ్చు. కానీ వ్యక్తుల మూర్తిమత్వాలు మానవాళి అనుభవాల్నీ, వారసత్వాన్నీ అర్థవంతంగా మలిచిన ఘటనలు లేకపోలేదు. ఎప్పుడెక్కడెలానో అంగీకరించబడినా, నిరాకరించబడినా, జ్ఞాపకాల్లో నిలిచినా, విస్మరించబడినా ఈ అనుభవాలది సముచిత స్థానమే.

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ చారిత్రకోపన్యాసకుడు నాకు ప్రియమిత్రుడూ ఆర్. ట్రివర్ రోపర్ తన ముందుమాట రాసి గౌరవాన్ని చేకూర్చినందుకు ధన్యవాదాలు. మహారాజులు, దేశ ప్రధానమంత్రుల పీఠికలకంటే ఆయన రాసిన ముందుమాట నాకూ, ఈ గ్రంథానికి చాలా విలువయినది. అందుకు ఆయనకు కృతజ్ఞుడ్ని.

– ఆర్.వి.ఎం.జి. రామారావ్

దొందూ దొందే

వీధిలోని అబ్బాయి ఏం మాట్లాడలేదు
వీధి చివర అమ్మాయి బేలగా చూసింది.
కాల్పనికుడు దానిని ప్రేమంటాడు;
అస్తిత్వవాది అది శృంగారమంటాడు;
ఆ అమ్మాయి, అబ్బాయి చుట్టూ చూసారు
పైకీ కిందకీ చూపులు పరికించారు.
కవికి సంగీతం వినిపించింది
మునికి మోక్షం కనిపించింది
అబ్బాయి ఒకవైపు కదిలాడు
అమ్మాయి మరోవైపు వెళ్ళింది
రక్షకభటుడు కీడు శంకించాడు
రాజకీయవేత్త పితూరీని చూసాడు.

అధ్యాయం-1

పుట్టక

1910, అక్టోబర్ 21న రాజుగారి కోటలో వారసుడు జన్మించాడని ప్రకటించారు. అది నేనే. ఆరోజు సంబరాలు అంబరాన్నంటాయి. రాజప్రాసాదాలన్నీ వెలుగులతో కొత్త కాంతులతో మెరిసిపోయాయి. అలంకారాలు, హర్షధ్వానాలు మిన్నుముట్టాయి.

రాజుగారికి బిడ్డ పుట్టాడనే వార్త గ్రామాలన్నింటికీ దావానలంలా వ్యాపించింది. ఆరోజు నాకు స్నానం చేయించారు. భారతదేశంలో స్నానం పవిత్రమైంది. ఎంత అసాధారణమయినదయితే అదంత పవిత్రంగా భావించబడుతుంది. ఐతే, సరిగ్గా అదెందుకు అసాధారణమో చర్చనీయాంశమే అయినా ఇప్పుడది అప్రస్తుతం. మొత్తానికి రాజుగారు సంతోషించారు, ప్రజలూ, పండితులు కూడా సంతోషించే ఉంటారు. ఇక ఆచారాల్ని ప్రశ్నించేదెవరు? రాజ పురోహితులు నా జ్యోతిష్యచక్రం గీసారు. దాని ప్రకారం నక్షత్రాలు కూడా నాకు అనుకూలంగానే ఉన్నాయట. అనువయిన స్థానాల్లో ఉండటమే కాదు, నా బంగారు భవిష్యత్తు కోసం ఇక అటూ ఇటూ తిరగడం మానేసుకున్నాయట కూడాను. అలా చెప్పిన పంతుళ్ళందరూ ఈరోజు చచ్చిబతికిపోయారు.

రాజపుత్రుడు జన్మించాడంటే, రాజ్యంలోని ప్రతి ఇంట్లో కొడుకు జన్మించినట్లే సంబరపడ్డారు. ప్రతి ఇల్లూ పరవశించిపోయింది. అలా కాపలాదారుల నడుమ ఠీవీగా కూర్చొన్న రాజుగారి దగ్గరికి చాలా జాగ్రత్తగా పొత్తిళ్ళలోంచి తీసిన నన్ను ఒక ఇంగ్లీషు నర్సు తీసుకొని వచ్చింది. ప్రేమాప్యాయతలతో నిండిన ఆశీర్వచనాలు చుట్టుముట్టాయి. అదో బావోద్వేగభరిత సందర్భం.

అనేక భూస్వామ్య దేశాల్లోలాగానే ఇండియాలో కూడా జమిందారూ, అతడి ప్రజలు ఒకే కుటుంబంగా ఉంటారు. సుఖదుఖాలన్నీ కలిసే పంచుకుంటారు. వేలమందికి అన్నదానం జరిగింది. వస్త్రదానమూ ఐయింది. గుడులూ గోపురాల్లో పూజాపునస్కారాలు, అభిషేకాలు హోమాలు అన్నీ జరిగాయి.

లంకంత కోటలో అంతెత్తు గోడల నడుమ ఒక పెద్ద గదిలో మహారాణీ పడుకున్న పట్టెమంచానికి కాస్త దూరంగా జోగుతున్న బుజ్జాయికి ఇదంతా పట్టలేదు. గుక్కపెట్టి ఏడ్చి మళ్ళీ నిద్రపోయాడు. లోకంలోకి అప్పుడే వచ్చిన నూతన చొరబాటుదారుడు! ఆ బుజ్జాయి భావాలేమిటో అక్కడెవరికీ తెలీవు. ప్రపంచంలోకి అతడి ప్రవేశాన్ని వారంతా స్వాగతించారేకానీ ఒక నియతి ప్రకారం సాగుతున్న ఈ లోకంలో ఆ చిన్నారి అస్తిత్వాన్ని గురించి మదింపు వేయడం సులువు కాదు. జరిగిపోయిందానిని గురించి ఇప్పుడనుకుని లాభం లేదు. అతడు ఎక్కడ్నుంచొచ్చాడు, ఎక్కడికి వెళ్తాడు ఏదీ తెలీదు. అసలా జీవి ఏంటనేది కూడా సందేహమే. తాత్వికులు, శాస్త్రజ్ఞులు సత్యాన్ని ఉజ్జాయింపుగా ఉదహరించగలిగారే కానీ కచ్చితంగా ప్రకటించలేదు. ఇంకా డోలాయమానంలోనే ఉన్నారు. కాంటు, హేగెలు, తత్వము, సత్తూ ఇంకా నిర్వాణమూ ఇవన్నీ పదార్థ రూపాలే కానీ యదార్థ సత్యం మాత్రం ఇంకా రహస్యంగానే ఉంది. బలహీనమయిన మెదళ్ళూ, పేలవమయిన పదాలు సత్యాన్వేషణ దగ్గర చతికిలపడతాయి.

అధ్యాయం-2

బాల్యం

ప్రేమ ద్వేషం, విలాసాలు విలాపాలు కలగలిసిన దివ్యమయిన జీవితంలోకి ప్రవేశించాను. వైభవాలు – వైరాగ్యాలు, సార్వభౌమాధికారం – బానిసత్వం... ఈ చెత్తంతా జీవితంలో భాగమే. ఇదంతా నాకు నచ్చిందని చెప్పలేను. చాలామందిలాగానే వచ్చింది స్వీకరించి ముందుకు సాగాను. కొన్ని నచ్చాయి, కొన్ని నచ్చలేదు.

మా కోట ఆధునాతన పద్ధతుల్లో నిర్మితమైంది. నాకు అన్ని సౌకర్యాలూ ఉండేవి. ఎప్పటికప్పుడు మరింత నాగరీకరించబడే విశాలమయిన విభాగాలు విలాసంగా దర్శనమిచ్చేవి. చలువరాతితో చేసిన వెచ్చని నా స్నానాలగదంటే నాకిష్టం. షవర్‌బాత్ సౌకర్యం కూడా ఉండేది. వెచ్చని నీటితో స్నానం ముగించి బాత్‌రూం నుండి డ్రెస్సింగ్ రూంకి వెళ్ళేటప్పుడు నాకు భలే హాయిగా ఉండేది. స్నానం నాకెప్పుడూ సరదాగానే ఉండేది, నడకే నచ్చేది కాదు!

అందమయిన పూదోటలు, ఉద్యానవనాలతో మా కోట ఎప్పుడూ హృద్యంగా ఉండేది. నాన్నగారికి తోటపనంటే ఇష్టం. అప్పుడప్పుడు ఆయన తనకిష్టమయిన గులాబీలు సున్నితంగా తుంపుతుండేవారు. ప్రపంచంలోకి అన్ని ప్రాంతాల నుండి గులాబీ మొక్కల్ని తెచ్చి సంరక్షించేవారు.

మాకు అన్ని రకాలైన పనివాళ్ళూ, ఉద్యోగులూ ఉండేవారు. నాకంటూ అన్నీ చూసుకోవడానికి ప్రత్యేకంగా నలుగురు పనివాళ్ళుండేవారు. వాళ్ళెప్పుడూ నన్ను ముస్తాబు చేయడంలో మునిగి ఉండటం ఆశ్చర్యమేసేది.

చిన్న పిల్లాడిగా నేను కోటలో స్త్రీల మందిరంలో ఉండేవాడ్ని. రాజు, ఆయన కొడుకులకి తప్పితే పరపురుషులెవరికీ అక్కడికి ప్రవేశం లేదు. చివరకి రాణీగారి అన్నదమ్ములొచ్చినా కూడా ముందుగా అనుమతి పొంది అధికారిక లాంఛనాలన్నీ పాటించి కొద్దిసేపు మాట్లాడి వెళ్ళిపోవాల్సి వచ్చేది.

రాణీవాసంలోని కొన్ని విభాగాలలోనికి ప్రవేశించాలనంటే రాజుగారు, కుమారులు కూడా ముందుగానే అనుమతి పొందాల్సి వచ్చేది.

అక్కడ పనిచేసే అందమయిన అమ్మాయిలు నిజంగా చాలా ఆకర్షణీయంగా ఉండేవారు. రాజభవన రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించేవారు. ఏది జరగాలో లేదా జరగకూడదో నిర్ణయించేవారు. రాణీవాసపు స్త్రీలు వారివారి భర్తల్ని, కొడుకుల్ని ఈ కన్యల నుండి కాపాడుకోడానికి అష్టకష్టాలు పడేవారు.

మాకు మాంచి కుక్కలు బోలెడుండేవి. వాటి బాగోగులు చూసుకోడానికి ఖరీదైన జీతాలతో సంరక్షకులుండేవారు. ఆంగ్లేయులు కూడా మా శునక సంరక్షకులుగా పనిచేసేవారు. ఆనాడు ఆంగ్లేయ పాలన సమయంలో ఆంగ్లేయ ఉద్యోగుల్ని నియమించుకోవడం తృప్తినిచ్చేదేమో. ఈ కుక్కలకి సంబంధించిన వ్యవహారమంతా నాకు కాలం, ధనం వ్యర్థం చేయడంగా తోచేది. అయితే ధనికుల అలవాట్లన్నీ ఇలానే ఉంటాయి మరి.

నాకెన్నడూ కుక్కలంటే అస్సలిష్టం ఉండేది కాదు. వాటి వాసనంటేనే నాకు అసహ్యం. భావితరాల్ని ఈ శునకప్రేమనుంచి ఎలా మరల్చగలననేది గొప్ప చింత నాకు!

ఇంకా మా దగ్గర అనేక రకాలయిన పక్షులు, జంతువులు ఉండేవి. ఒకసారి నాన్నగారు ఇంగ్లాండు నుండి నెమళ్ళు తెచ్చి ఎస్టేటులో స్వేచ్ఛగా వదిలేసారు. వాటి సంతతి వృద్ధి చెందుతుందనుకున్నాం. కాని ఏడాదికే అవన్నీ కనిపించకుండా పోయాయి. తోట సంరక్షకుల నిజాయితీకి, వాట్ని తిని అరిగించుకున్నవాళ్ళ జిహ్వాచాపల్యానికి కృతజ్ఞతలు.

మా దగ్గర అన్నిరకాలైన గుర్రాలు కూడా ఉండేవి. నాకు అశ్వాలంటే ఇష్టం. అందమయిన గుర్రాలనెక్కి హుందాగా రాజసంగా వెళ్ళడం నాకు నచ్చేది. ఎన్నో గుర్రపు బగ్గీలు మావద్ద ఉండేవి.

కొన్ని ఏనుగులు కూడా ఉండేవని జ్ఞాపకం. కానీ రెండు, మూడింటినే గుర్తు చేసుకోగలుగుతున్నాను. నేను వాట్ని పట్టించుకునేవాడ్ని కాదు. కొండంత శరీరాలతో అది సవారీకి అనుకూలంగా ఉండేది కాదు.

ఆ కాలంలోనే మోటారు వాహనాలు వచ్చాయి. అలా తీసుకువచ్చిన రోల్స్‌రాయిస్సంటే నాకెంతో ఇష్టం. నాటి నుండి నేను మంచి కార్ల ప్రేమికుడినే. రోల్స్‌రాయిస్, బెన్ట్లీ కార్లని నేను ఎంపిక చేసుకునేవాడ్ని.

ఆనాటి జమిందారులకి ఎస్టేటులోని గ్రామాలకీ, ఆస్తిపాస్తులకి, నిధులకి, నగలకి గాను అధికారాలు ఉండేవి. ఎందరో ఉద్యోగులు, ఎన్నో విభాగాలు పనిచేయడం జరిగేది.

పాఠశాలలు, కళాశాలలు, అనాధ శరణాలయాలు, పేదవారి కొరకు వసతి గృహాలు, వైద్యశాలలు, మందిరాలు కొనసాగేవి. నాన్నగారు దానాల కోసం 50 లక్షలు ఖర్చు పెట్టేసారు. నా పూర్వీకులకీ విషయం తెలిస్తే ఎలా స్పందిస్తారో నాకు ఆసక్తి కలిగేది.

ఇదే నా బాల్యం, ఇంకా వారసత్వం. ప్రేమ, విశ్వాసం, ప్రతిజ్ఞల మధ్య నేను పెరిగాను. అయితే, అసూయ ద్వేషాలు నన్ను నాశనం చేయడానికి చీకట్లో సిద్ధంగా ఉన్నాయి.

అధ్యాయం-3

అలా నడుస్తుండగా....

బహుశా జీవితంలో అత్యంత ఆకర్షణీయమైంది అనిశ్చితతే అనుకుంటాను. నిర్దాక్షిణ్యంగా ఆవహించే హఠాత్సంఘటనల సమాహారం అది. మృత్యువుని గురించిన భావన కూడా అలాంటి అనిశ్చితి తెచ్చే సంతోషమే.

చిన్నపిల్లాడిలా ఉన్నపుడు నేను ఎప్పుడెప్పుడు యువకుడ్నవుతానా అని తొందరపడేవాడ్ని. అందుకే జీవితమంటే అనవసరమయిన సుదీర్ఘ జంజాటంలా నాకు తోచేది.

బహుశా ఇంట్లోని నియంతృతం నుండి స్వతంత్రం పొందడానికే నా సరాల నాడీ వ్యవస్థ అలా భావించేదేమోమరి. నాన్న ఫస్ట్‌క్లాస్ నియంత. తర్వాతనే అమ్మ. నేనెంత సేపు నిద్రపోవాలి, ఎంతసేపు మెలకువగా ఉండాలి, ఎక్కడికి వెళ్ళాలి, ఏయే ఆటలు ఆడుకోవాలి, స్నేహితులుగా ఎవర్ని ఎన్నుకోవాలి, ఏ బట్టలు వేసుకోవాలి, ఏం తినాలి, ఏం నేర్చుకోవాలి చివరికి ఏం ఆలోచించాలి వాటినెలా వ్యక్తపరచాలో కూడా ఆదేశిస్తుండేవారు. ఇంతకంటే పెద్ద నియంతృత్వమూ, ఇంటికంటే పెద్ద కాన్షన్‌ట్రేషన్ కేంపూ ఇంకేదీ ఉండదు. ఈ విధానాలే నాలో తిరుగుబాటు స్వభావానికి బలంగా అంకురార్పణ చేసాయి. ఈ విషయంలో నెహ్రూ గుర్తొస్తున్నాడు. ఆ మహనీయుడి నోటి నుండి స్వయంగా మొదటిసారి నేను విన్న మాటలివే : **నేను తిరుగుబాటుదారుడిగానే పుట్టాను, తిరుగుబాటుదారునిగానే కొనసాగుతాను** అన్నాడాయన. బ్రిటీష్‌వార్ని భారతదేశం నుండి పంపేయడానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సమావేశం అది. చెప్పుకోదగ్గ గొప్ప సంస్కరణవాదిగా నాన్నగారు దానికి వెళ్ళారు. ఆయన అప్పుడప్పుడు చాలా ధైర్యంగా సాంఘిక – రాజకీయ నిర్ణయాలు తీసుకునేవారు. ఆయనతో నేనూ వెళ్ళాను. ఆనాటి దేశ దిక్సూచి, యువతకి ఆరాధ్యుడు, మహాత్మాగాంధీ హృదయంగా పేరొందిన జవహర్‌లాల్ నెహ్రూవంటి వ్యక్తితో ఒకే వేదిక పంచుకోవడం నాలో ఉత్కంత కల్గించింది. అదే వేదిక మీదనో, లేదా అక్కడేనో అప్పుడే నేనెంతగానో ఆరాధించే గాంధీజీని కూడా చూసాను. ఆనాటి ఉదయాన్నే నెహ్రూగారి సోదరినీ నాకెంతో ఆప్తురాలిగా మారిన అందమయిన సరోజినీదేవిగార్ని చూడటం జరిగింది. ఆమెంత అందంగా ఉందో.

నేనంటే మా అమ్మనాన్నలకి ప్రేమాభిమానాలు ఉండేవనేది నిజాయితీగా ఒప్పుకుంటాను. కానీ, నేను జీవితాంతం అనుభవించిన నియంతృత్వమూ, క్రూరత్వమూ

మిగిలిన వాటన్నింటినీ మరుగుపర్చాయి. అప్పుడప్పుడూ ఇంట్లోంచి పారిపోవాలనుకునేవాడ్ని, కాని ధైర్యం లేకపోయేది. అందరూ చిన్నప్పుడే నన్ను ఇష్టపడటం, అప్రయత్నంగానే అసూయపడటానికి కారణమవడం నాకు వెగటుగా ఉండేది.

అలాంటి స్థితిలో గొప్ప మేధావి, అద్భుతమయిన వ్యక్తి, సాంఘిక సంస్కరణావాదైన కందుకూరి వీరేశలింగంగారి మిత్రుడు శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు నాకు ఎంతగానో తోడ్పడ్డారు. ఆయన ప్రార్థిస్తున్నపుడు చూడటం ఎంత అద్వితీయమయిన అనుభూతో! అలానే గాంధీగారు ప్రార్థన చేస్తున్న చిత్రపటాన్ని ఆయనే నాకు బహుమతిగా ఇచ్చారు. మద్రాసు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్స్‌లర్‌గా పనిచేసినాయన ప్రభావం మా నాన్నగారొకరిపైననే కాదు, ఆయన పరిచయస్తులందరిమీద ఉండేది. నా తరపున నాన్నతో యుద్ధంచేసి మెట్రిక్యులేషన్ చదవడానికి తోడ్పడ్డారు. కానీ యూనివర్శిటీ చదువుకు మాత్రం నాన్నతో సరేననిపించ లేకపోయారు. కొద్దోగొప్పో వోదార్పేమిటంటే ఇంట్లోనే నాకు చదువు చెప్పడానికి అధ్యాపకుల్ని నియమించారు. ఆక్స్‌ఫర్డ్ నుండి వచ్చిన ఆ పండితులు సాహిత్యం, సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్, రాజనీతి శాస్త్రం, తత్వశాస్త్రం నాకు బోధించేవారు. నేను సొంతంగా అప్పటికే బూతు పుస్తకాలెన్నో చదివేవాడ్ని. అది ఉత్సాహపరిచేది.

ఆక్స్‌ఫర్డ్ నాకు కలగానే మిగిలింది. నా ప్రియమిత్రుడూ, ప్రఖ్యాత చరిత్రకారుడు, క్రీస్తుచర్చి సీనియర్ అయిన ట్రివర్ –రోపర్‌తో నేనెప్పుడూ అదే అంటాను, తండ్రిగా నేను పరాజితుడ్నయిన చోటనే ఆ ఆక్స్‌ఫర్డ్‌లో నా పెద్ద కొడుకు పట్టా పొందాడు.

ఇక్కడో విషయం చెప్పాలి. బాల్యంలో నా ఆరోగ్యం బాగుండేది కాదు. ఇద్దరు స్త్రీలు నన్ను అక్కున చేర్చుకుని కంటికి రెప్పలా చూసారు. ఒకామె ఇంగ్లీష్ నర్సు ఆంటీనార్త్, మరొకామె కెనడాకి చెందిన బాప్టిస్టు వైద్యురాలు ఆంటీ జెస్సీ అలీన్. వీళ్ళిద్దరూ కన్నతల్లి కంటే ఎక్కువ నాకు. చిన్నప్పుడు నాకు డబుల్ నిమోనియా (ఊపిరితిత్తులకి సంబంధించిన వ్యాధి) వచ్చింది. చికిత్సలేవీ పనిచేయలేదు. అంతా ఆశ వొదులుకున్నారు. దేవుడ్ని ప్రార్థించడం మినహా ఏమీ చేయలేదు. అంతలో హఠాత్తుగా ఆగిపోయిందనుకున్న నాడి మళ్ళీ పనిచేయడం ప్రారంభించింది. అందుకే నా స్వంత ఆస్తికత్వపు – నాస్తికత్వపు భావాలతో కాకుండా క్రైస్తవ ప్రార్థనల బాలుడిగా నన్ను నేను భావించుకున్నాను. అప్పుడే మా నాయనమ్మ ఒకామె నాకు బాగైతే మా ఇలవేల్పు తిరుపతి వెంకన్నకి జుట్టు ఇస్తానని మొక్కుకుందట. కలియుగ దైవంగా, శక్తివంతమయిన స్వామిగా హిందువులు వెంకటేశ్వరుడ్ని పూజిస్తారు. అలా రెండు మతాల ముద్దుబిడ్డగా బతికి బట్టకట్టాన్నేను. ఈ వివరణకి మహత్తుగా అతిచేసి తీసుకోనక్కర్లేదు. నా అభిప్రాయం చెప్పానంతే.

నాకు బోలెడన్ని బొమ్మలు రకరకాలవి ఉండేవి. అందరు పిల్లల్లాగానే ఇంకా కొత్త కొత్త బొమ్మలు అందరూ తెచ్చి యిచ్చే పుట్టినరోజంటే నాక్కూడా ఎంతో ఇష్టం. నా 18వ ఏట పుట్టినరోజుకి బహుమతిగా రోల్స్‌రాయిస్ ఇవ్వబడింది. కార్లూ, ట్రైన్లూ చిన్నపుడు నా అభిమాన ఆటవస్తువులు. చాలామంది అబ్బాయిల్లాగానే నాకూ ఇంజను డ్రైవర్నవ్వాలనుండేది.

కానీ నేనెన్నడూ డ్రైవరు కాలేదు. అనేక కోరికల్లాగానే అది కూడా అణిగిపోయింది. నేనెన్నో కావాలనుకొన్నాను. నెపోలియన్, గ్లాడ్‌స్టన్, జార్జ్ వాషింగ్‌టన్ ఇంకా లెనిన్‌లా కావాలని కలలు కన్నాను. వాల్మికి, షేక్‌స్పియర్, టాగోర్ ఇంకా టాల్‌స్టాయిలా అవ్వాలనుకున్నాను. నెహ్రూ ఆరాధ్యుడైతే నాకు గాంధీ ఆదర్శనీయుడు. కానీ నేను గాంధీని కావాలనుకోలేదు. దూరంగా ఉంటూనే గాంధీజీ స్ఫూర్తి స్వీకరించాలనుకున్నాను. గాంధీ నేను చేరుకోలేనంత ఉన్నత శిఖరం అనే నిజం మొదట్లోనే గ్రహించాను. నాగరిక బట్టల్ని, తిండిని ఇంకా ఆధునిక జీవన విధానం అందించిన మేలైన వస్తువులు, సాధనాలన్నింటినీ నేను స్వాగతిస్తాను, ప్రేమిస్తాను. కానీ బుద్ధుడు నా అంతిమ స్వప్నం.

ఏకకాలంలో నేను ఎపిక్యూరియన్‌గానూ, ప్రపంచానికతీతమయిన రుషిగాను ఉండాలనుకున్నాను. అస్తిత్వవాదిగా ఉంటూనే అలుపెరుగని స్వాప్నికుడిగా ఉన్నాను. మనస్విగా మెలుగుతూనే మాంసపుముద్దగా మారాను. భగవద్గీత, ఒమర్ ఖయ్యాం రుబాయత్‌లు రెండూ సామాన్యుడి మోక్ష సాధనకి సరిపోతాయని నమ్మాను. మార్మికవాదిగా, అర్థం చేసుకోలేని మేధావిగా కనిపించాలనుకునేవాడ్ని.

మరణం గురించిన గీతాబోధల్ని వల్లె వేస్తూ ఆత్మకి మరణం లేదని ఉద్ఘాటించే మనమే మళ్ళీ భౌతిక సుఖాల్ని ప్రేమిస్తాం. శారీరకమయిన కోరికల్ని పారమార్థిక పారవశ్యానికి అనుసంధానించి దానినే ఆనందం అంటాం.

ఒకసారి లండన్‌లో డబ్ల్యు.ఆర్. ఇంగ్ నాతో మాట్లాడుతూ సామ్యవాదానికి సంబంధించిన ఆదర్శాన్ని ఖండించారు. అందరూ సరిగా ఉన్నప్పుడు సోషలిజం సరైందే, అయితే అంతా సరిగ్గానే ఉంటే ఇంక సోషలిజం అవసరం లేదన్నారు. గీతని విపరీతంగా అభిమానించే ఆయన, ముందే దానిని చదవనందుకు గాను విచారించారు.

జీవితంలో అనుకున్నట్లుగా ఏదీ కాలేక, నాకు నేనొక గందరగోళంగా మిగిలాను. అనేక కారణాలవల్ల నేనో ఒంటరి పిల్లాడిని. నాలో నేనే మాట్లాడుకునేవాడ్ని. నవ్వుకునేవాడ్ని, ఒంటరితనంతో బాధపడుతూ ఏడ్చేవాడ్ని. అప్పుడప్పుడూ గర్వపడేవాడ్ని. నన్ను చూసి

నేనే జాలిపడేవాడిని. జీవితం నన్ను నాకు నచ్చిన వైపు కాక దానికి తోచిన దిశకి తీసికెళ్ళింది.

ఇదంతా ఏదైనా ఆటా? లేదా సృష్టికర్త ప్రణాళికా? ఎవరికి తెలుసు? ఎవరు పట్టించుకుంటారు? ఇదో ముఖ్యమైన ప్రశ్న – మనల్ని చేసారా లేదా అయ్యామా?

నాకు పాఠాలు జరుగుతూవున్నాయి. వాట్ని నేను అసహ్యించుకుంటాను. నావయిన కలల్ని నిర్మించుకోడాన్నే నేనిష్టపడతాను. పగటి కలల్లో పరవశించిపోతాను. నేనోమంచి కవిగా రచయితగా మారతాను. ఎన్నో సంగతుల అంతు తేలుస్తాను. ఎవరకీ తెలీనివి కూడా తెల్సుకుని మేధోసంపన్నుడినౌతాను. అధ్యాపకులు నన్ను అభిమానించేవారు, నేను వాళ్లని ప్రేమించేవాడ్ని. ఒక ఘటన గుర్తొస్తుంది. ఒక అధ్యాపకుడు హఠాత్తుగా రావడం మానేసి నాకు బోధించాల్సింది లేదని సొంతంగా చదువుకోవచ్చనే వార్త పంపాడు. అదో గొప్ప అనుభవం. స్వీయానుభవాల్నే జీవితపాఠాలుగా మార్చి చదువుకోవడం. ఆనాటి నుండి నిరంతర విద్యార్థిగా నేను జ్ఞానార్జన కోసం నిజమయిన ప్రయత్నం చేసాను. పుస్తకాలు, మనుషులు, వాళ్ళ మంచి చెడులు, స్త్రీలు, సుందరాంగులు, వికారులు... అందంగా లేని స్త్రీలని అలంకార గదిలో, పడకగదిలో నేను అసహ్యించుకునేవాడ్ని. జంతువులు, పక్షులు, పుష్పాలు, నదులు, పర్వతాలు, నింగి, నేల అన్నీ నాకు గురువులే. ప్రకృతెంత పెద్ద గ్రంధాలయమో! ఎన్ని చదివానో!

క్రీడలు నేనిష్టపడేవాడ్ని. టెన్నిస్‌కి ప్రాముఖ్యత ఇచ్చేవాడ్ని. స్త్రీలు కూడా దాని తర్వాతే. నేను పక్కా ప్లేబోయ్‌ని, విలాసపురుషుడ్ని. బహుశ అందుకే జీవితం ఒక ఆటగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది నాకు. నా జీవితం నాకో నాటక రంగం.

జీవితమనే నాటకరంగం ఎంతో వైవిధ్యమైంది. గంభీరతతోపాటూ తేలికగా అనిపించేది. అందంగా, ఆసక్తికరంగా కనిపించి కవ్వించేది. అయితే ఈ నాటకం ఆఖరి దశకి చేరి తెరదించే సమయానికి గతం కొరకు పశ్చాత్తాపపడి ప్రయోజనం లేదు.

పేకాట, జూదాన్ని నేనిష్టపడేవాడ్ని. చాలాసార్లు మోసగిస్తూ ఆడేవాడ్ని. చిన్నతనంలో నాకు మోసం చేయడం నచ్చేది కాదు కానీ జీవితంలో నన్ను నేనెన్నోసార్లు మోసగించు కున్నాను, ఫలితం అనుభవించాను.

అప్పుడప్పుడూ షికారులకి వెళ్ళేవాళ్ళం. అవేమంత సంతోషంగా అనిపించేవి కావు. నేననుకున్నదేదీ చేయలేకపోయేవాడ్ని. ఎక్కడికి వెళ్ళాలో, ఎక్కడ ఆగాలో ముందుగానే

నిర్ణయించబడేది. అనుకున్న దుకాణాల్లోనికి కూడా వెళ్ళలేకపోయేవాడ్ని. చాలాసార్లు వ్యాపారస్తులే స్వయంగా ఇంటికి సామాను తీసుకొచ్చేవారు.

మామూలుగా మేం రోల్స్‌రాయిస్‌లో వెళ్ళేవాళ్ళం. అది రథంలా ఉండేది. దాని ముందు సీటులో మా రక్షణకిగానూ ఇద్దరు రక్షకభటులు తుపాకులో, కత్తులో పట్టుకుని కూర్చునేవారు. ఆ వెనకనే కారులో అధికారులు, సేవకులు మమ్మల్ని వెంబడించి వచ్చేవారు. ప్రజలకి అదంతా తమాషాగా ఉండేది. ఇప్పుడైతే మమ్మల్ని పిచ్చోళ్ళని రాళ్ళేసి కొట్టేవారేమో కూడా. కాలంతోపాటూ పద్ధతులూ మారతాయి మరి.

చివరికి రాజభవనంలో మేం ఆటలాడేటప్పుడు కూడా ఈ రక్షణ ఏర్పాట్లు చేయబడేవి.

కానీ ఈ పిచ్చికి ఒక అర్ధముంది. మేం చాలా ముఖ్యులమనే సారాంశం గోచరించేది. ముఖ్యంగా నేను, వారసుడిగా నాపై ప్రత్యేక శ్రద్ధ ఉండేది. ఎందుకనంటే రాజకుటుంబాల్లో కుట్రలు, కుతంత్రాలు, హత్యా ప్రయత్నాలు మామూలు విషయాలు. నాపైనా, ముఖ్యంగా మా నాన్నగారిపైనా పలుమార్లు విషప్రయోగం జరిగింది. అందుకే అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోబడేవి.

మేం తినే ప్రతీ పదార్థాన్ని ముందుగా వంటవారు తిని పరీక్ష చేసాక మాత్రమే వడ్డించేవారు. ఆఖరికి పరీక్షించకుండా గ్లాసు నీరు తాగేందుకు కూడా అనుమతి లేదు. స్నానం చేసే నీళ్ళు కూడా జాగ్రత్తగా పరీక్షించి తాళం వేసి ఉంచేవారు.

ప్రాణం ఎంత విలువైందో అంతే చౌకయ్యింది.

అధ్యాయం-4

కొనసాగుతున్న కథ

పండగలు, పబ్బాలు, ప్రయాణాలు, అప్పుడప్పుడూ వచ్చే అనారోగ్యాలు మాత్రమే నా బాల్యాన్ని కాంతివంతం చేసాయి. అన్ని పండగలు జరిపేవారు కానీ దసరా పండగకి పదిరోజులపాటు గొప్ప సందడి ఉండేది. రామరావణయుద్ధం సందర్భంగా చేసుకునే పండగది. ఆ పదిరోజులు సెలవులు ఇవ్వబడేవి. అందరకీ కొత్తబట్టలు పెట్టేవారు. తొమ్మిది రోజులపాటు వివిధ ఆటపాటలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేవి. పదోరోజు గోవులకి, ఏనుగులకి, గుర్రాలకి తిండి పెట్టాక కాసేపు క్రీడా కార్యక్రమాలు జరిగేవి. అనంతరం నాకు బంగారుపళ్ళెం నిండా మాంచి పసందైన పదార్థాలతో విందు భోజనం పెట్టేవారు. సుబ్బరంగా తిని తర్వాత మా అనాధ శరణాలయంలోని పిల్లలకి మంచి భోజనం పెడుతుంటే దగ్గరుండి చూసేవాడ్ని. మేం ఆ పిల్లల్ని సొంత అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళ వరుసతో పిలిచేవాళ్ళం. వాళ్ళూ మా కుటుంబంలో సభ్యుల్లాగే మసలేవారు. అనాధ శరణాలయ స్థాపన నాన్నగారు చేసినవాటన్నింటిలోకీ గొప్ప పనని నేను భావిస్తాను. ఆహారం, వసతి, విద్యా ఆ బుజ్జిపిల్లలందరికీ కల్పించడానికి మించిన మానవత ఇంకేముంటుంది? ఆ పిల్లలందర్నీ మాతో సరిసమానంగా ఆదరించిన నాన్నగారి గుండె ధైర్యాన్ని చూసి ఎప్పటికీ అబ్బురపడుతుంటాను. అనాధ పిల్లలకి ఆశ్రయం ఇచ్చి వాళ్ళని సొంత సంతానంలా భావించడానికెంత దమ్ముండాలి?

సాయంత్రం దర్బారు కొలువుతీరేది. అసలయిన అధికారాలన్నీ నిజానికి బ్రిటీష్‌వారి చేతుల్లోనే ఉన్నప్పటికీ ఏదో తంతు కోసం అన్నట్టుగా ప్రజలందరి సమక్షంలో రాజు, రాజ వారసుడనైన నేనూ మందీమార్భలం చుట్టుముట్టి ఉండగా, గడీ ముందు భవనమంతా సమయానికి నిండిపోయేది. ప్రత్యేక అతిథులు హాజరయ్యేవారు. రాజావారి పక్కన పండితులు, సంబంధిత అధికారులు ఆసీనులయ్యేవారు. ఆ రోజుల్లో మనుషులెంత మర్యాదగా మసలేవారో, మర్యాద, మాన్యతలే భారతదేశ ప్రజల ఔన్నత్యం.

దర్బారులో మరోవైపు రాణీవాసమంతా ఉండేవారు. గడీకి ముందు వైపు వచ్చినవారు, ప్రజలు చెప్పుకుందుకు ఖాళీ ఉండేది. ఇప్పటికీ ఆ వాతావరణాన్ని తల్చుకొంటే ముచ్చటేస్తుంటుంది. గడీ చాలా దర్పంగా ఉండేది. ఎదురుగా హుందా అయిన సింహాసనం. అది మా తాతలనాటి నుండి పవిత్రంగా ప్రతిష్టించబడింది. అక్కడ నాన్నగారు కూర్చునే పాటికి దేవుళ్ళు, పెద్దలు, పండితులు, ప్రజల ఆశీర్వచనాలు పొందుతారు. భూమ్మీద రాజే దేవుడని ప్రతీతి మరి.

చాలామంది వాళ్ళ స్వప్రయోజనాల కోసం నేను త్వరగా మరణిస్తానని భావించారు. నేనూ అలాగే అనుకునేవాడ్ని కానీ చివరికి వారికి అసంతృప్తే మిగిలింది. మంత్రిగా

చెప్పుకునే దివాను దర్బారు కొలువైందని ప్రకటించేసరికి అంతా గంభీరంగా అయ్యేవారు. మాకు ప్రత్యేక దుస్తులు, ఖరీదయిన ఆభరణాలు, కత్తులు కటారులెన్నో ఉండేవి. వాటన్నింటితో రాజావార్ని స్తుతిస్తూ రక్షకభటులు ప్రదర్శన చేసేవారు. మతం, తత్వశాస్త్రం, తర్కం ఇలా వివిధ శాస్త్రాల్లో నిపుణులయిన విజ్ఞానవేత్తలు మాకు ఉండేవారు. ఇందరి మధ్యలోంచి నాన్నగారు గడీపైకి మెల్లగా ఎక్కి పద్మాసనం వేసుకుని కూర్చోగా, నేనోవైపు కూర్చునేవాడ్ని.

ఇంతలో దర్బారు మొదలయ్యేది పండితులు ఒక్కొక్కళ్ళే వచ్చి నాన్నని ఆశీర్వదించేవారు. ఆస్థాన సంగీత విద్వాంసుడు అద్భుతమయిన వీణానాదాన్ని వినిపించి మమ్మల్నందరినీ మైమరపించేవాడు. ఆయన వీణానాదమంటే రవీంద్రనాథ్ టాగోర్‌కి కూడా ఎంతో ప్రేమ. మరోవైపు ఆహుతులందరికీ తాంబూళం, అత్తరు, గులాబీ సువాసన ద్రవ్యాలు ఇచ్చి గౌరవించడం జరిగేది. దర్బారు ముగిసాక నాన్నగారు తిరిగి తన ప్రాసాదానికి పోయేముందు రాణీవాసస్త్రీలు హారతి ఇచ్చేవారు. అలా ఇస్తూ ఎప్పుడూ ఒకే పాట పాడేవారు. నాన్నగారికి ఈ తంతంతా నచ్చేది కాదు. చివరగా మేం రాణీవాసానికి వెళ్ళేవాళ్ళం. నాన్న త్వరగా వెళ్ళిపోయేవారు కానీ నేను అక్కడే కొంతసేపు ఉండేవాడ్ని. వాళ్ళంతా నన్ను ముద్దుచేసేవారు.

రాజుగారికి, వారసుడికి ప్రత్యేక అధికారాలు, అవకాశాలు ఉండేవి. స్త్రీలు మాముందు మేలిముసుగులు ధరించనవసరం లేదు. ఆ రాత్రి భుక్తాయాస భోజనం చేసి సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించేవాళ్ళం. అవి గొప్ప సరదాగా ఉండేవి. మరీ చిన్నప్పుడైతే నేనవి చూస్తూ నాకు తెలీకుండానే నిద్రపోయేవాడిని. నాన్నగారితోపాటు గడీ మీద వారసుడిగా కూర్చొనే అధికారం నాకొక్కడికే ఉందనేది నన్ను గర్వపరిచేది.

ఆయుధ పూజ కూడా జరిగేది. ఆ రోజున కత్తులు, కటార్లు, తుపాకులు అన్నీ పేర్చగా పురోహితులేవో మంత్రాలు చదివేవారు. చివర్లో బలి ఇచ్చేవారు. ఆ ఆయుధాలు రక్తదాహంతో ఎంతోకాలంగా తపిస్తున్నట్లుండేవి. మా అహింస, ప్రేమ, శాంతిమయ జీవనానికి అదే మంచిదేమో నాకు తెలీదు. హింసాహింసలకు మధ్యస్థంగా నాన్న చిన్న నిమ్మకాయకి కన్నం పెట్టేవారు. ఆధునిక యుద్ధ పిపాసులు ఈరోజు వాళ్ళ మాటలతో, రాతలతో కయ్యానికి కాలుదువ్వుతున్నారనుకోండి. అది వేరే సంగతి.

నాకమితంగా నచ్చే రెండు కరవాలాలుండేవి ఒకటి నడుముకు కట్టుకునే పట్టా కత్తి కాగా రెండోది తన ప్రాణాల్ని కాపాడినందుకు నిజాం ప్రభు మా పూర్వీకులకి ఇచ్చింది. హైద్రాబాద్ నిజాం వద్ద మా పూర్వికుడు అంగరక్షకుడు. నిజాంకి తన మంత్రి భార్యతో ప్రేమాయణం నడిచేది. అది తెల్సిన మంత్రి నిజాంపైకి రాగా అంగరక్షకుడయిన మా పూర్వికుడు ఒకే ఒక్క వేటుతో గుర్రాన్నీ, మంత్రినీ ఆరు ముక్కలుగా నరికాడట. అందుకే ఆ కత్తిని 'ఒక్క వేటుకి ఆరు ఖండాల ఖడ్గం' అని పిలుస్తాం.

అధ్యాయం-5

ప్రయాణాలు

నేనో మంచి యాత్రికుడ్ని. ప్రయాణం అనే భావనే నన్ను ఉత్సాహపరుస్తుంది. ఎన్నో లక్షల కాంతి సంవత్సరాల్లోకి ప్రయాణించాననీ, ఇంకెన్నో కాంతి సంవత్సరాలు నా ప్రయాణం కోసం ఉన్నాయనిపించేది. ఆ నక్షత్రాల్ని చూడటం నాకిష్టం. నా దేశంలో ఎన్నో ప్రదేశాలు పర్యటించాను. యూరపు దేశాలు అమెరికా ఇంకా పిరమిడ్లు చూడటానికని కైరో కూడా వెళ్ళాను. ఇంకా చూడాల్సినవి ఎన్నో ఉన్నాయి. అవెప్పుడు చూస్తానో, అసలు చూస్తానో లేదో తెలీదు. నాకోసం నిర్ణయించబడ్డ భవితని నేనూహించలేను.

పిరమిడ్లు నాకంతగా నచ్చలేదు. కానీ తాజ్‌మహల్ ఉత్సాహపర్చింది. నయగారా జలపాతం నన్నాకర్షిస్తే, కాంచనగంగ వంటి హిమాలయ శిఖరాలు చకితుడ్ని చేసాయి. నేను అప్పుడప్పుడు ఒంటరితనం అనుభవించేవాడ్ని. గొప్ప విసుగు. అనాసక్తి ఆవరించేది. అలా లండన్‌తో, పారిస్‌తో, న్యూయార్క్‌తో, జీవితంతో విసిగిపోయాను. ఇక చాలు అనిపించేది. కానీ భగవద్గీతలోని కర్మయోగంలా ఫలితం కోసం కాకుండా పని చేసుకుపోయినట్లు, అనుకున్నంతలో ఏదీ కాదనిపిస్తుంది. ప్రయాణం అలానే అలవాటుగా మారింది. నాకంటూ స్వతంత్రం వచ్చేదాకా అమ్మా నాన్న, అక్కలు చెల్లెళ్ళూ అన్నదమ్ములతో ప్రయాణాలు చేసేవాడ్ని. మా నాన్న ఎక్కడికైనా వెళితే మేమంతా కూడా వెళ్ళేవాళ్ళం. మా ప్రయాణాలు సైన్యం చేసే పహారాల్లా ఉండేవి. వెళ్లొచ్చే వరకూ పేద్ద హడావుడి. ట్రైన్ ఎక్కడమంటే అదో గొప్ప తతంగం. కూడా నాలుగైదు వేనుల సామానుండేది. నౌకర్లు, ఉద్యోగులకీ ప్రత్యేక పెట్టెలు. మా కుక్కలు, కోళ్ళు, పడకగదులు, సౌందర్య సాధనాలకోసం ఏర్పాట్లు. ఒక్కోసారి మా కార్లు కూడా తెచ్చుకునేవాళ్ళం రైళ్ళలో.

ఒకసారి మా ఎస్టేటు సమీప గ్రామాలకి పడవల మీద వెళ్ళాం. అక్కడ అద్భుతమయిన స్వాగతం లభించింది. యువరాజుని ప్రసన్నం చేసుకునేందుకు జరిగిన ఏర్పాటే ఐనప్పటికీ ఆ ప్రజల ప్రేమాభిమానాలు కదిలించాయి.

పెళ్ళైన కొత్తలో అమ్మానాన్న, నా భార్య, ఇంకా అన్నదమ్ములు తదితరులమంతా కల్సి నెలల తరబడి ఈజిప్ట్, ఇంగ్లాండు, అమెరికా, జర్మనీ, స్వీడన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, ఇటలీ, ఫ్రాన్స్ తదితర దేశాలు తిరిగొచ్చాం.

వెళ్ళిన చోటల్లా అతి ఖరీదైన విలాసవంతమైన భవనాలు హోటళ్ళూ విడిదులుగా ఉండేవి. కింగ్‌జార్జ్, క్వీన్‌మేరీల పార్టీలో బంకింగ్‌హం ప్యాలెస్‌లో పాల్గొన్నాం. లండన్‌లో మాకోసం మద్రాస్ గవర్నర్ లార్డ్‌డెర్బి ఏర్పాట్లు చేసారు. హౌస్ ఆఫ్ కామన్స్ సందర్శించడం మొదలుకుని ఎన్నో అనుభవాలు, మరెన్నో అనుభూతులు. కెనడాలో వో జర్నలిస్టు రాజా కుటుంబం శీర్షికన మా నౌకర్ల ఫోటోలు పత్రికలో వేసాడు. మద్రాస్ గవర్నర్ తర్వాత ఇండియాకి గవర్నర్ జనరల్‌గా చేసిన వైస్రాయ్ లార్డ్ విల్లింగ్‌టన్ జమీందారుగానున్న నాన్నని రాజరిక అధికారం స్వీకరించమంటే సున్నితంగా తిరస్కరించారు. ఒకసారి వెనీస్‌లో అద్దాల ఫ్యాక్టరీ చూడ్డానికి పోతే డజనుమంది అమ్మాయిలు ప్రేమిస్తున్నామని నా వెంట పడ్డారు! వెంటనే నేనక్కడ్నుంచి వెళ్ళిపోయాను. వెంట నా భార్య ఉంది మరి.

అధ్యాయం-6

స్త్రీ

సాధారణ పురుషుడెవరికయినా స్త్రీ అవసరం. శారీరకంగాను, మానసికంగాను, శృంగారానికయినా, అమలిన ప్రేమకయినా స్త్రీ పురుషుల వాంఛ బలీయమైనది. ఆకలి, దాహాల్ని మరిపించగల శక్తి కలది. మనిషి భవితని నిర్దేశించగల సహజాతం అది. ఇంద్రధనుస్సులోని రంగుల్లా ఎంత రసాత్మకమయిందో, భూకంపంలా అంతే భయంకర మయింది. మంచో, చెడో, ఉన్నతమో, అధమమో ఏదయినా కానివ్వండి, కోరికైతే ప్రాధమ్యం కలదే. దీనిని ఒప్పుకోని వాళ్ళంతా ఫ్రాయిడ్‌నీ, వాస్తవాల్నీ తృణీకరిస్తున్నారన్న మాటే.

స్త్రీ అనే భావన నేను ప్రేమిస్తాను. నేను ప్రేమని ప్రేమించాను. శృంగారాన్ని ప్రేమించాను. అక్కర్లేని నైతికతల మధ్య ఊపిరి సలపకుండా పెరిగిన వాతావరణం ఒక్కసారిగా బద్దలవ్వక మానదు. ఆ రకమయిన నీతిబోధలంటే నాకసహ్యం.

హిపోక్రసీ కేన్సర్‌లాంటిది. ఒక్కసారి వచ్చిందా ఈ రాచపుండు మొత్తం వ్యవస్థని కలుషితం చేసి నాశనం చేసేస్తుంది. హేతువుకి నిలబడని చెత్తనంతా వదిలేయెచ్చు. అనివార్యమయిన నిజాన్ని అంగీకరించాలి. ప్రేమించడం సరైందే, కాబట్టే శృంగారం.

బెట్రెండ్ రస్సెల్ పెళ్ళికి ముందు కౌమారంలోనే ఆనందించాడు. బెర్నండ్‌షా ఈ తతంగాన్నంతా అనుమానించాడు. ఇంగ్లాండులోని చర్చిల బిషప్పులు కూడా ఒక దశలో వ్యభిచారానికి శిక్ష వేయడానికి వెనకడుగేసారు.

చాలామంది ప్రాక్పశ్చిమ దేవుళ్ళూ, దేవతలంతా శృంగారాన్ని ఆనందించినవారే. మహాగ్రంధాల్ని వారి జీవితాలతో నింపేసిన మహామహులందరూ జీవితంలో ఈ ప్రధానమయిన లైంగికతనే అంశానికి లోబడి సగౌరవంగా సమర్పించుకున్నవారే.

పెళ్ళనేది జీవితంలో ఒక భాగం. ఎంత ముఖ్యమయిందో అంతే మోసపూరిత మయింది. ఆ అర్థంలేనిదానిని ఎందుకు పాటిస్తున్నారో అర్థం కాదు. ఇప్పుడయితే పెళ్ళనేదో పేద్ద తొలనొప్పి వ్యవహారంలా కనబడుతుంది. అక్కడక్కడా మినహాయింపులుంటే ఉండవచ్చునేమోకానీ పెళ్ళి అనేక కోణాల్లో వినాశకరమైంది. ఒకరి స్వేచ్ఛని మరొకరు హరిస్తూ, దీర్ఘకాలిక బంధం పేరిట పరస్పర అహంభావాల్ని సంతృప్తి పర్చుకుంటూ చేసే ఆ వ్యాయామం ఏ ఒక్కరికీ జీవితంలో సంతోషాన్నివ్వదు. అలా యాంత్రికంగా బతుకీడ్చడం కంటే అర్ధరహితమయింది ఏముంది? అసలిదంతా ఎందుకు? చాలామంది

మేధావులు కూడా ఈ బంధంలో చిక్కుకుంటారు. మానవాళి పరిణామక్రమంలో హత్యలు, ఆత్మహత్యలు చేసుకోకుండా ఎలా బతికిబట్టకట్టగలిగిందో అలాగే పెళ్ళి కూడా రద్దు చేసుకోకుండా ఉండిపోయింది. ఇది చర్చ కోసం చెబుతోంది కాదు. లోతుగా ఎవరికివారు ఆంతరికంగా తరచి చూసి పరిశీలించాల్సిన విషయం.

ఐనా, నేను పెళ్ళి చేసుకున్నాను. మొదట్లో నా భార్యని కాక వేరొకామెని చేసుకోవాలనుకున్నాను. నా తల్లిదండ్రుల థర్డ్‌డిగ్రీ పద్ధతుల ముందు నా కోరికలు ఓడిపోక తప్పలేదు. నా భార్య అద్భుతమయిన వ్యక్తి. ఆమె నాకు నలుగురు కొడుకుల్నిచ్చింది. మొదట జన్మించిన శిశువు రెండ్రోజుల్లోనే చనిపోవడం జరిగింది. ఆ బాబే ఇప్పుడున్న పెద్దబ్బాయిగా పుట్టాడనుకుంటాం మేము. మనుషులవి ఏం చిత్రమయిన ఆలోచనలనీ!

నా కొడుకులంటే నాకు గర్వం. అన్యోన్యంగా తప్పా నా కుటుంబ సభ్యుల్లో ఒకరిపైనొకరు అధికారం చెలాయించడాన్ని నేను సహించను. పవిత్రమా, అపవిత్రమా అనేది అనవసరం. ఏ మానవ సంబంధం సవ్యంగా మనగలగాలన్నా, ఏ కుటుంబం సంతోషంగా సాగాలన్నా స్వేచ్ఛ తప్పనిసరి ప్రమాణం. అలా కాకపోతే మొత్తం నిర్మాణం కూలిపోతుంది. ఒక చైనా కథుంది. తండ్రిని కొడుకులు రోడ్డుమీదికి ఈడ్చిపారేసారట. ఇంకా ఈడ్చుకుపోతున్న కొడుకులతో వారిస్తూ తండ్రి అన్నాడట; "ఇక చాలు పుత్రులారా, నా తండ్రిని నేనింతవరకే ఈడ్చాను" అదే రకంగా నేనంటాను: "నా తండ్రి ఇక్కడిదాకా నన్నీడ్చేసాడు. నేనైతే మిమ్మల్ని అలా ఈడ్చాలనుకోవడం లేదసలు!"

నా కొడుకులు చదువుకున్నవాళ్ళు, ఉద్యోగులు. బలవంతుల కోసమే ఉద్దేశించబడిన ప్రపంచంలో నెట్టుకురాగల సమర్థులు. పురాతన కుటుంబానికి చెందిన నూతన తరాన్ని నేను చూస్తున్నాను. నా పెద్దకోడలు ఇద్దరు ముచ్చటైన మనవల్ని మాకిచ్చింది. మేం విశాలమయిన లోకంలో జీవించగలుగుతున్నాం.

మా కుటుంబంలో ఇప్పటికి మూడు డిగ్రీ పట్టాలుండటం గర్వకారణం. మా పెద్దబ్బాయి ఎం.ఏ. ఆక్స్‌ఫర్డ్ ఐతే కోడలు మద్రాసులో బి.ఎ. ఆనర్స్, అలాగే మూడో అబ్బాయి కూడా బి.ఎ. ఆనర్స్. ఈ ముగ్గురే కుటుంబంలో మొదటి డిగ్రీలు పొందినవాళ్ళు. మా రెండో అబ్బాయి కూడా ఇంగ్లాండులో ఉన్నత చదువులు చదివాడు కానీ డిగ్రీ తీసుకోడానికి ఆతృతపడలేదు. వాడు పరీక్షలకీ, నైట్ పబ్బులు, క్లబ్‌లకీ మధ్య న్యాయం చేయలేక పోయాడేమో మరి.

నా పెళ్ళి పెద్ద వేడుక. ఎందరో అతిరథమహారథులు, గొప్ప విందులు, వినోదాలు, వరుసగా మూడు రోజుల పాటు జరిగాయి. అప్పుడైనా మా మావగారికి హఠాత్తుగా సుస్తీచేసి అనారోగ్యంపాలు కావడం వల్లన కొద్దిగా ఏర్పాట్లు నిమ్మళించాయి. పెళ్ళిలో నన్ను పల్లకిలో మోసిన తంతు గొప్పగా విద్యుత్తు బలుబులతో అంగరంగ వైభవంగా జరిగింది. పాపం ఆ బోయలు నన్నెంతసేపలా మోసారో. అప్పుడెంతోమంది సిపాయిలు, ప్రజలు, అతిథులు ఊరేగింపుగా కదిలారు. సంగీత ధ్వనులు, బ్యాండ్ మేళం, మంగళహారతులు ఆశీర్వచనాలు. తోపులాటలు జరిగినప్పుడు నా సోదరుడొకాయన డైనమోతో షాకులిచ్చి జనాల్ని అదిలించేవాడు. అన్ని రకాల హడావిడులు అయ్యాక హిందూమత సంప్రదాయం ప్రకారం నేను మంగళసూత్రధారణ చేస్తూ తాళి కట్టాను. మామూలుగా మూడుముళ్ళేస్తారు, నేనా తొందరలో రెండు ముళ్ళే వేసాను. మూడోదానికి తాడు చాలక అక్కడొకామె సహాయకురాలితో చెప్పగా ఆమె వచ్చి మూడోముడేసింది. శాస్త్రీయంగా మూడుముళ్ళు నేనేయని మా దాంపత్యం ఇప్పటికీ పాపంగా కొనసాగడమనే ఆలోచనే నాకోరకమైన ఉత్కంఠ కలిగిస్తుంటుంది. తర్వాత తలంబ్రాలు పోసుకున్నాం. మామీద అక్షింతలు చల్లారు. ఆ సాంప్రదాయాలన్నీ అర్ధరహితమైనవే. మాది వశిష్ట గోత్రమట. పూర్వీకుల ఆశీర్వాదం కోసం చేసే ఈ తంతులన్నీ తగ్గించి మా అబ్బాయి వీలైనంత నిరాడంబర పెళ్ళి చేసుకున్నాడు. నా పెళ్ళిలో గొప్ప విందు ఏర్పాటు చేసారు. బంధువులు, అతిథులు ప్రతీ వ్యక్తికి 64 పిండివంటలతో విందు భోజనాలు పెట్టాం. 64 పవిత్ర సంఖ్య అనుకుంటా. ఆ పదార్థాలు ఎక్కువమంది తినలేదు. కొందరైతే తాకి వదిలేసారు. ఈ తంతులన్నీ ముగిసి వివాహం ఒక కొలిక్కి వచ్చింది. మైధునానికి ఇంత ప్రచార ఆర్భాటమేమిటో. శృంగారం కనుక పాపమైతే మరి ఈ తంతంతా ఎందుకో!

ఆడవాళ్ళని ఆటబొమ్మల్లా ఆడుకునేవాడిని. పాలపుంతలా అందమయిన స్త్రీలని సేకరించడం, వారిని నా స్నేహితులుగా ఉంచుకోవడం నాకలవాటు. ఐతే, అది గతం. ఏ ఆటలోనయినా అలసట తప్పదు. శృంగారం కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఈ ఆటలన్నీ బాగుంటాయి కానీ పెళ్ళితో ఆటలాడటం నిప్పుతో చెలగాటమే. కావాలని చేతులు కాల్చుకోవడం. ఏదేమయిన నాకు పెళ్ళైంది, నాకంటూ ఒక ఆమెవుంది, బహుశా ఆమెకూ నేనలాగే.

అధ్యాయం-7

నాలో అలజడి – సంఘర్షణలు

నాలోని తిరుగుబాటు తత్వానిది నిత్య సంఘర్షణ. అనేక అంశాలతో నాకు అశాంతి, అసంతృప్తి. తల్లిదండ్రుల పెంపకంలోని ఆధిపత్యం, దేశంలోని నియంతృత్వం సత్యం, న్యాయం, స్వతంత్రంపై అణిచివేతే నా ఆగ్రహానికి కారణం. అదృశ్యంగానున్న వాటినేమీ చేయలేనప్పుడు కంటికి కనిపించే భూతాలమీదే విరుచుకుపడతాను. అప్పటికింకా పూర్తి యవ్వనంలో సమిధిగా భగభగమండుతున్నాను. జీవితంలో నేర్చుకోవాల్సిన పాఠాలింకా ఉన్నాయి. ఎంత ఉత్సాహవంతుడ్నో అంతే ఉద్రేకిని. తొలినాళ్ళలో ఓ కవిత రాసాను;

“ఖైదులో చిత్రహింసలనుభవిస్తున్న
కరడుగట్టిన చిరకాల పాపిని
పాటలెలా గానం చేయగలను?”

నేనమితంగా అభిమానించే అధ్యాపకుడు నాలోని ఈ అలజడి చూసి ఆశ్చర్యపోయి ‘ఇంత చిన్న వయసులో ఎంత అసహనం... ఎందుకు ఇదంతా?’ అన్నాడు. ‘చితిమంటల్లో దగ్ధమౌతున్న నా కపాలం నుండి కూడా విప్లవంతో ఉరకలెత్తే ఉగ్రాగ్ని ఉత్తేజంతో ఉవ్వెత్తున ఎగసిపడి అద్వితీయమయిన ఆశయాల్ని అందించదా’ అని ఎక్కడో రాసాను.

1931 కాలంలో బాబు రామనాధ ఛటర్జీ సంపాదకత్వంలో వెలువడిన ‘మోడరన్ రివ్యూ’కి నేను కొన్ని రచనలు చేసాను. అవన్నీ రాజకీయపరమైనవి. రెండు వ్యాసాల గురించి పేర్కొవాలి. మొదటిది విశ్వజనీన ప్రభుత్వం (World Government) కి సంబంధించినది కాగా రెండోది కులీన వర్గాల స్థితిగతులు అనివార్యంగా దారితీసే పరిణామాలు ఇంగ్లాండ్‌లోని మాగ్నాకార్టా ప్రకటనా, ఫ్రెంచ్, రష్యన్ విప్లవాల్ని విశ్లేషిస్తూ రాసింది. ఈ రెండో వ్యాసానికి భారీ స్పందన వచ్చింది. ఎన్నో లేఖలు వచ్చాయి. ఆంధ్రా సింహంగా పేరుగాంచిన టంగుటూరి ప్రకాశంగారు తన పత్రిక ‘స్వరాజ్య’లో నాకు మద్దతు ప్రకటించారు. ఒక అభిమాని ఏకంగా ‘భారతీయ మాజినీ’ అని సంబోధిస్తూ, తాను గారిబాల్డీననీ, నా ఆదేశాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని రాసాడు!

మద్రాసు బ్రిటీష్ గవర్నర్ నాన్నగారికి కబురుపంపి నా వ్యాసంపై ఆక్రోశం వెలిబుచ్చాడు. అందులోని భావాలు జాతీయవాదాన్ని సమర్ధించేవిగానే కాక బోల్షివిజాన్ని సమర్ధించేవిగా ఉన్నాయని వాపోతూ, పిఠాపురం ఆస్థానం నుండి ఈ విధమయిన భావాలు పెల్లుబెకడంపై నిర్ఘాంతపోతున్నట్లు చెప్పాడు. నాన్నగారు ఆయనతో పూర్తిగా అంగీకరిస్తూ

నన్ను వివరణ అడగడమే కాక బ్రిటిష్ చక్రవర్తి సార్వభౌమత్వాన్ని క్షమాపణ కోరవలసిందిగా ఆదేశించారు. మొట్టమొదటిసారి నేను ఆయన మాటలకి 'చెప్పన'ని జవాబిచ్చాను. ఆ క్షణాన అది నా విజయం. నేను రాసిన వ్యాసానికి మూల్యంగా నా స్వేచ్ఛ స్వాతంత్ర్యం హరించుకుపోయి ఖైదుచేసి చెరశాలలో పెట్టినా, చివరికి నా ప్రాణాలు తీసినాసరే ఆ అక్షరాలకి కట్టుబడి ఉన్నానని ఉద్ఘాటించాను. రాష్ట్ర కేబినెట్‌తో సహా దేశంలోని నా వర్గ ప్రతినిధులే ఆ వ్యాసం చూసి కలవరపడి నన్ను దూరం పెట్టారు.

జాతీయోద్యమంలో నేను చురుకుగా పాల్గొన్నాను. విదేశీవస్తు బహిష్కరణోద్యమంలో ఎంత తీవ్రంగా ఉన్నానంటే వోవల్టైన్ పానియం (బోర్న్‌విటా, బూస్ట్, హార్లిక్స్, కాంప్లాన్ వంటిది – అను) కూడా తాగడం మానేసాను. గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల గొప్ప వ్యక్తిత్వాల్ని చూసి ప్రభావితమయ్యాను.

కాంగ్రెస్ జాతీయోద్యమ నాయకులయిన కొద్దిమంది మిత్రులు నన్ను జాగ్రత్తగా ఉండమనీ, సిఐడిలు, రహస్య పోలీసులు నన్ను ఖైదుచేసే అవకాశం ఉందని హెచ్చరించారు. నేను పట్టించుకోలేదు. నా దేశ స్వాతంత్ర్యం తప్పా ఇంకేదీ ఆ సమయంలో నన్ను కదిలించలేదు.

ఐతే బ్రిటీష్‌వారంటే నాకేమంత ద్వేషం లేదు. వాళ్ళు ప్రశంసించదగ్గ గొప్పవాళ్ళు. వాళ్ళ నుండి మనం నేర్చుకోదగ్గ విషయాలున్నాయి. అయినప్పటికీ అర్ధనగ్న ఫకీరుగా చర్చిల్ అభివర్ణించిన గాంధీ అహింసతో పోరాటం చేయడమెలానో మనకి నేర్పించాడు.

కాంగ్రెస్‌లో సాధారణ సభ్యుడిగా నమోదు చేయించదల్చుకుని నా మిత్రుడు, మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు సి. రాజగోపాలాచారి వద్దకి వెళ్ళి కలిసాను. అప్పటికి గాంధీ, నెహ్రూ తదితర నేతలంతా జైల్లో ఉన్నారు. మొత్తం కాంగ్రెస్సే నిషేధంలో ఉంది. రాజాజీ నా ప్రాంతంలోనే పేరు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునికి రాతపూర్వకంగా విన్నవించుకుని నేను సభ్యుడ్నయ్యాను.

అదో పెద్ద వార్త. మా నాన్నగారి 60వ జన్మదినోత్సవ వేడుకలో వేదికమీద మాట్లాడుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్టాభి సీతారామయ్యగారు, తాను జైల్లో ఉండగా నేను కాంగ్రెస్‌లో చేరాననే వార్త తెల్సి ఆశ్చర్యపోయానని చెబుతూ, కొడుకు తండ్రికి మార్గదర్శి కాగలడని ఆశించానన్నారు.

నేను అరెస్ట్ కాలేదన్న బాధ వెంటాడేది. ఐతే, తర్వాత దేశవ్యాప్తంగానున్న రాజకీయ ఖైదీలందర్నీ విడుదల చేసారు. స్వాతంత్ర్య సాధన ఊపందుకుంది. హర్షాతిరేకాలు

వెల్లువెత్తాయి. అప్పుడే కామన్వెల్త్ సమావేశాల్లో నేనొక్కడినే ఇంగ్లాండ్‌కి మద్దతుగా ఇండియాపై వారి సార్వభౌమాధికారాన్ని సమర్థిస్తూ మాట్లాడాను.

అప్పుడే నా వ్యక్తిగత జీవితంలో కూడా నేను స్వతంత్రుడ్నయ్యాను. తల్లిదండ్రుల ఇంట్లో ఇమడలేక మొత్తానికి భార్యాపిల్లలతో బయటకొచ్చేసాను. అదో అసాధారణ విజయం. చివరికి స్వేచ్ఛాజీవిగా గాలిపీల్చుకోగలిగాను. నా శరీరానికీ, ఆత్మకీ కూడా ఇదో దివ్యమయిన అనుభవం.

నేను బాగా రచనలు చేస్తున్నాను. తప్పుడు భ్రమలు, భావాలు, అక్రమ విలువలు, దొంగ ప్రవక్తలకి వ్యతిరేకంగా అక్షరాల్ని ఎక్కుపెట్టాను. ఏ గౌరవనీయ స్త్రీ కూడా నే రాసింది చదవదని ఒక విమర్శకుడన్నాడు. కానీ అదే ఆశీర్వాదంలా పనిచేసింది. గౌరవనీయ స్త్రీ నా రచనలు చదవడం వల్లనే రెండో ముద్రణలు కూడా పొందాయి.

రాయడం నన్ను నేను వ్యక్తపరచుకునే సాధనం, అందులో నేనెంత అవ్యక్త ఆనందం అనుభవిస్తానో! ఒకోసారి అలా రాస్తూ నన్ను నేనే మర్చిపోతాను. ఎక్కడో ములిగి మరెక్కడో తేలుతాను. శివతాండవంలా అక్షరాల్లో నర్తించి, అలసిసొలసి నచ్చింది సృష్టిస్తాను. అలా అక్షరాల ద్వారా నా సృజనాత్మకతనే ఇచ్ఛని తీర్చుకుంటాను. ఆ సృజనని ఏదోక రోజు ఏదోక విశ్వవిద్యాలయం గుర్తిస్తే ఆ ఉత్కంత నాకు తృప్తినిచ్చేది కానీ రెండు యూనివర్శిటీలు నా పుస్తకాలు రెండింటిని పాఠ్యాంశాల్లో ప్రస్తావించి చేతులు దులుపుకోవడం పట్ల నిరాశనొందాను.

అధ్యాయం-8
జీవితంలో అభిరుచులు

నాకు జీవితంతో అనుబంధమేం లేదు. కానీ జీవించడంలోని ఆనందాన్ని ఆస్వాదిస్తాను. లేకపోతే బతకడం అర్థరహితంగా, అసాధ్యమయిపోతుంది. అక్కర్లేని విషయాలన్నింటి కోసం ఆలోచించి, లోకంలోని చెడుగుల్నేమి చేయలేని అసమర్థతపై విసుగొచ్చి ఒత్తిడికి లోనవుతాం. ఏ మాత్రం సున్నితత్వమైనా మిగిలితే ఆత్మహత్య చేసుకుంటాం. అలా కాకుండా మూర్ఖుడి స్వర్గంలా జీవితం ముసుగుతీసి ఆనందాన్ని అన్వేషించాలి. జీవించడంలోని సంతోషాన్ని సంతరించుకుని, అస్తిత్వం మధురానుభూతిగా మల్చుకోవాలి. అదే జీవించడానికి అవసరమయిన అభిరుచి.

నావి విస్తృతమయిన, అనంతమైన అలవాట్లు. నేనెన్నో ఆటలాడాను, జీవితమనే ఆటతో సహా. టెన్నిస్ బాగా ఆడతాను. ఆ క్రీడ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఎందరో పరిచయస్తులు, మిత్రులు నాకు కలిగారు. టిల్డన్ అంటాడందుకే, 'టెన్నిస్ ఆట రాకెట్టులా దూసుకుపోయేందుకు పనికొచ్చే అంతర్జాతీయ పాస్‌పోర్టు' అని. టిల్డన్, కోచెట్, రెమిలియన్, బర్క్‌లు ఈ ఆటలో నాకు అతిథులు, ఇంకా మిత్రులు. అఖిల భారత టెన్నిస్ సంఘానికి వరసగా మూడేళ్ళు అధ్యక్షుడిగా చేసాను. తర్వాత నేనే వద్దనుకున్నాను. మంచి క్రీడాకారులకోసం నేను ప్రతిపాదించిన ఇన్సూరెన్స్ పథకం పిచ్చిదన్నారు. పితాపురం తరపునుండి అంతర్జాతీయంగా ఒక బహుమతినీ, మహిళా క్రీడాకారుల్ని తయారుచేసుకునే కార్యాచరణనీ రూపొందించాం. టెన్నిసంటే అభిరుచి ఉన్న వైస్రాయి లిన్‌లిత్‌గోని కల్సి సంఘం అభివృద్ధికి ప్రయత్నించాను. ఏ క్రీడనయినా ఆడటమనేది జీవితంలో ఆత్మవిశ్వాసంతో సొంత కాళ్ళమీద నిలబడే ధైర్యాన్నిస్తుంది. అలా ఆటల్నుంచి ఏమీ నేర్చుకోనివాళ్ళు సరయిన ఆటగాళ్ళు కారు. టెబిల్ టెన్నిస్ సంఘాన్ని సైతం కొద్దిమంది మిత్రుల సాయంతో ఏర్పాటు చేసాం. అది అంతర్జాతీయ సంఘంలో భాగస్వామైంది.

ఏ రంగంలోనయినా సృజనాత్మకత చాలా ముఖ్యం. అది మన మేధో వైశాల్యాన్ని తృప్తిపరుస్తుంది. నేను చదివాను, రాసాను. నా భావాలు కొత్త ఎత్తుల్ని, లోతుల్ని పరిచయం చేస్తాయని నమ్మాను. నిర్దిష్ట దశకొచ్చాక ఆలోచించడానికి జంకాను. ఉపనిషత్ చింతనలో లాగా అంధకారం ఆవలనున్న వెలుగుని కనుగొనడానికి మానవ మేధస్సు జరిపే అన్వేషణ ఇదేనా? ప్రపంచంలోని ఎందరో అందగత్తెలతో నేను నర్తించాను. తిన్నాను, పడుకున్నాను,

సంగీతాన్ని, కళనీ ఆస్వాదించాను. భయంకరంగా ప్రేమించాను, కామించాను. మనస్ఫూర్తిగా నవ్వాను, గుండె పగిలేలా ఏడ్చాను. విస్తృతంగా తిరిగాను, విశాలత్వాన్ని పొందాను.

ఎన్నో దేశాలు, ఎందరో ప్రఖ్యాతులు, పట్టుపారవశ్యం, విందు, మందు చిందు, బహుపసందు. అతిథుల్ని మహారాజుల్లా చూసుకుని అలవికాని సత్కారాలు చేస్తాననే పేరు గడించాను. నేను ఏర్పాటు చేసిన పార్టీలకి సంబంధించిన విశేషాలు వార్తాపత్రికలు కీర్తిస్తూ రాసేవి. అందుకు నేను చెల్లించేవాడిని! అతిథులకి శాయశక్తులా సర్వసుఖాలు అందించేవాడిని, నేనూ అలాగే అనుభవించేవాడ్ని. నన్ను నేను ఎన్నడూ వంచించుకోలేదు, ఇతరుల్ని ఎప్పుడూ వంచించలేదు. భారీగా దానధర్మాలు చేసేవాడ్ని, వీలైనంతెక్కువే విరాళాలకిచ్చేవాడ్ని. ఖరీదైన దుస్తులు, ఎంపిక చేయబడ్డ సువాసనద్రవ్యాలు, స్నానానికి కూడా నాణ్యమయిన అత్యంత ఖరీదయిన సబ్బుల్నే వాడేవాడిని. మంచిగంధం లేనిదే మహిళల జోలికి వెళ్ళేవాడ్ని కాదు. ఆకాశంలోని నక్షత్రాల్ని కూడా నా అరికాలి దగ్గరకి రప్పించుకునేవాడ్ని. సామాజిక సేవ పేరుతో నటించే సంఘాల్లో ఉండేవాడ్ని. చట్ట సభలో అలానే సభ్యుడ్నయ్యాను. దానికి ఎవరో వానరసైన్యమనే పేరు తగిలించారు.

అధ్యాయం-9

రాజకీయ వివాదాలు

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలవుతున్నాయి. మా పార్టీ అధికారంలో ఉంది. నేను తిన్నగా సభలోకెళ్ళి స్పీకర్‌తో కరచాలనం చేసి కూర్చున్నాను. నాకు గుర్తున్నంతవరకూ ఆ సభలో బడ్జెట్‌పై నేను చేసిన ప్రసంగం అన్ని వర్గాల ప్రశంసలూ అందుకొంది. అదేరోజు సాయంత్రం రెండోసారి ప్రసంగించాను. శాంతిభద్రతల కోసం ప్రభుత్వానికి ప్రత్యేకాధికారాలుండాలనే బిల్లుపై చర్చ. నేనా బిల్లు సమర్థించాను. కమ్యూనిస్టులు మాత్రం దానిని విమర్శించారు. ప్రభుత్వ అధికారం దుర్వినియోగమౌతుందని వాళ్ళ ఆందోళన.

నేను అవతలి పక్షపు దృక్పథాన్ని అర్థం చేసుకునేవాడ్ని. అన్ని వర్గాల వారిచేత గుర్తించబడ్డాను. అధికారపక్షం, ప్రతిపక్షం, సంప్రదాయవాదులు, ఉదారవాదులు, ఇండిపెండెంట్లు, ముస్లింలీగ్, కమ్యూనిస్టులు, యూరోపియన్లు వీరందరిలో ఎవరోకరితో ఎప్పుడూ విభేదిస్తుండేవాడ్ని. కానీ ప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ అందరి మన్ననలు పొందేవాడిని. అదేమంత విజ్ఞానస్థలి కాదుగానీ కొద్దిమంది సత్తాగల వ్యక్తులుండేవారు. అప్పుడప్పుడూ హాస్యం తొంగిచూస్తుండేది. నేను ప్రజాసేవకులనే పదంతోనే అందర్నీ సంబోధించేవాడిని.

సరైన రీతిలో ఉపయోగించే అధికారం ప్రజాహితానికే తోడ్పడుతుంది. అధికారం ఆకర్షణీయమైంది. వ్యక్తిగత ప్రయోజనాలకి వినియోగిస్తే పతనం కాక తప్పదు. అప్పుడెప్పుడో దేవుడు – ప్రభుత్వం వంటి ఆసక్తికర పుస్తకం ఒకటి చదివాను. అనేక అంశాలమీద నేను ప్రసంగాలు చేసేవాడ్ని. చట్టసభల్లోనూ, బయటా కూడా మాట్లాడేవాడ్ని. వివాహ విషయంలో బహుభార్యత్వాన్ని, బహుభర్తత్వాన్ని నేను సమర్థిస్తాను. స్వేచ్ఛమీద తప్పా పెళ్ళిమీద నాకు నమ్మకం లేదు. అవధుల్లేని స్వేచ్ఛనే నేను విశ్వసిస్తాను. జనం దానిని విశృంఖలత్వమంటే అననివ్వండి, నచ్చిన పదజాలాన్ని ఉపయోగించే స్వేచ్ఛ వాళ్ళకుంది.

మద్య నిషేదానికి నేను వ్యతిరేకం. మద్య నిషేధ బిల్లు ఏకగ్రీవంగా అంగీకరించ బడాలని పార్టీ అధ్యక్షుడూ, ముఖ్యమంత్రీ నన్ను సహకరించమని కోరారు. నేను ఒప్పుకోలేదు. దేశంలోనే మొదటిసారి అత్యధికంగా ప్రశంసలందుకున్న తీర్మానం అది. దానిని వ్యతిరేకించిన ఏకైక వోటు నాదే. ఎంతటి దిగజారుడు వ్యక్తినో కదా?

ఎవరూ మద్యం తాగకపోతే నేను సంతోషిస్తాను. కాని అది స్వయంగా పాటించాలి, బలవంతాన కాదు. నేను దాదాపు మత్తుపానీయాలన్నింటికీ దూరమయ్యాను. దాదాపని ఎందుకన్నానంటే ఎప్పుడైనా షాంపెన్ లేదా వైన్ కొద్ది మోతాదులో బుచ్చుకుని

తృప్తిపడుతుంటాను. ఒకసారలాగే లండన్‌లో రాత్రి భోజనమప్పుడు ఒక్క గ్లాసుతో మొదలెట్టిన షాంపేన్ అలా అరడజనుగ్లాసులు దాటింది. ఎంత తాగినా ఏమీ కాకపోవడంతో అసంతృప్తి చెందాను. పెంకిపనుల్ని, ఆలోచనల్ని ఆనందిస్తాను. ఐతే అవి వచ్చేందుకుఅవసరమయిన మద్యం నా మీద ప్రభావం చూపడం మానేసింది. మద్య నిషేధానికి విరుద్ధంగా ఒటేసేనాటికి ఒకట్రెండు గుక్కలు మినహా నేను తాగేవాడిని కాను. నేను తాగుబోతుని కాను. అదో బాధకర విషయం. అలాగేనల్లమందు కూడా నాకలవాటు లేదు. మనిషిని మరోలోకంలోకి తీసికెళ్తుందని విన్నాను. మద్య నిషేదానికి నేనెందుకు విరుద్ధమనేది స్పష్టం : ఆదాయం పడిపోవడం, మానవ స్వభావం, అక్రమ మద్యం ద్వారా తలెత్తే ప్రమాదకర పరిణామాలు అందుకు కారణం. బహిరంగంగా చెప్పడానికి ధైర్యంలేని నా పార్టీ గౌరవసభ్యుడు నా దగ్గరకొచ్చి నన్ను అభినందించాడు.

గాంధీజీకి ప్రియమయిన రెండు పనులున్నాయి. మొదటిది మద్య నిషేధం, రెండు ఖాదీ పరిశ్రమ. మద్య నిషేధం వలన పేదవాడి సొమ్ము కొద్దోగొప్పో కుటుంబానికి వెళు తోందని ఒప్పుకోవాలి, ఇంకా గృహహింస తగ్గింది. మేము సభలో మాత్రమే 'గౌరవనీయ' సభ్యులం. అదంతా ఉత్త భోగస్. చట్టసభ వెలుపల మేం 'గౌరవనీయులం' కాదు. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే అసలు మేమెన్నడూ గౌరవనీయులం కాదు. మేం అలా మాట్లాడుతూ, మాట్లాడుతూ, మాటలాడుతూనే ఉండాలి. అదే మా వృత్తి, అందుకోసమే మాకు జీతాలిస్తున్నారు. చెప్పొద్దూ, మేం మాట్లాడేది వినడానికి కూడా గొప్ప విసుగొస్తుంది. అయినా మాట్లాడుతూనే ఉంటాం. మా శక్తిని ఆ విధంగా యుక్తిగా ఖర్చుపెడతాం. అప్పుడిక పెద్దగా ఆచరించనక్కర్లేదు. అలాంటప్పుడే ఈ సభలు తక్కువ హాని చేయగలవ్. నిజంగా గంభీరమయిన కార్యాచరణ కనుక ఈ చట్టసభలు ప్రారంభిస్తే, కొనసాగిస్తే ఇంకేమైనా ఉందా. అధ్యక్షులు, ప్రముఖుల విజయపరంపరల సమావేశాలకీ, కీర్తికండూతి కార్యక్రమాలకీ తోవేక్కడుండేది? అవన్నీ లేకుండా జీవితం ఎంత కళాహీనంగా ఉంటుందో.

పాకిస్తాన్ అనే ప్రత్యేక దేశం ఏర్పాటుని సమర్థిస్తూ నేను మాట్లాడాను. నాకు తెల్సీ దీనికి అనుకూలంగా మాట్లాడిన మొదటి హిందూని నేనే. దేశ విభజన గురించి నాకేమంత పట్టింపు లేదు. కానీ అంతకుమించిన మార్గం నాకు కనబడలేదు. ఈ విషయంపై నేను గాంధీజీకి కూడా లేఖ రాసాను. ఆయన దానిని అందుకోలేదని ఆయన కార్యదర్శి తెలిపారు. ఒకసారి ఇదే అంశం గురించి నేనూ, రాజాజీ ఒకే వేదిక మీద నుండి ప్రసంగించాం.

నన్నో ద్రోహిగా ముద్రవేసారు. లెక్కలేనన్ని బెదిరింపు ఉత్తరాలు చంపుతామని వచ్చేవి. నేనేనాడూ వాటికి ప్రాధాన్యత ఇవ్వలేదు. బతుకెంతో నాకు చావూ అంతే. గొప్ప

వ్యక్తుల కోసమయితే బాధపడాలి. నేనో సుడిగాలి లాంటివాడిని. ఎన్నో విధ్వంసాలకి కారణమయ్యాను. సొంత పార్టీతో, విపక్షంతో కూడా తలపడ్డాను.

ఆఖరికి జమిందారి ఎస్టేట్లని జాతీయం చేసే తీర్మానం మాముందుకొచ్చింది. నేనెంతో శ్రమించి నా వర్గం యొక్క ప్రయోజనాలని కాపాడ్డానికి ప్రయత్నించాను. పార్టీలో పెద్దలు గాంధీజీ, నెహ్రూ, పటేల్, రాజాజీ, కృపాలనీ, రాజేంద్రప్రసాద్ ఇంకొందర్ని కల్సి సరైన పరిహారం పొందడం కోసం ప్రయత్నించాను. రాష్ట్ర కాంగ్రెస్ శాసన సభలోని ఏకైక జమిందారీ తరగతి వ్యక్తిగా అది నా బాధ్యత. ఏదేమైనప్పటికీ జమిందార్లకి అదొక విఘాతమే. అదో గొప్ప సాంఘిక విప్లవం. ధనిక – బీదవర్గాల మధ్య అంతరాలు తొలగేందుకు ప్రక్రియ మొదలయింది. ఆర్థిక అసమానతలు, భూమి తదితర అంశాల్లో ఈ ఎంపిక జరుగుతోంది. ఈ అసమానతల విషయంలో ఏదీ జరగకపోతే, ఏమీ చేయలేకపోతే రక్తపాతంతో కూడిన నరమేధం, ప్రతీకారంతో జరిపే తిరుగుబాటు మాత్రమే ప్రత్యామ్నాయం కాగలదు.

మొత్తానికి పరిహారాల్లో చర్చలు, రచ్చలు జరిగి కొలిక్కివచ్చాయి. మాలో జమిందార్లు ఎందరో బిక్షగాళ్ళు కాబోతున్నారు. నా చివరి ప్రసంగాన్ని నేనెంతో ఆర్ద్రతతో ముగించాను. సభికులు కూడా హృద్యంగా స్పందించారు. బిల్లు మధ్యాహ్న సభలో ప్రవేశపెట్టడం జరిగింది. అంతా నాకేసే చూసారు, అతలాకుతలం చేస్తున్న ఆలోచనలతో గట్టిగా అరిచాను 'సరే' నంటూ.

అధ్యాయం-10

శిఖరాలు – పతనాలు

నేను అసెంబ్లీకి రాజగోపాలాచారి చిత్రపటాన్ని బహూకరించాను. రాజాజీ నాకు రాజకీయ గురువు. రెండో ప్రపంచయుద్ధం సమయంలోనూ, అలాగే 'స్వతంత్ర పార్టీ' నేతగా కాంగ్రెస్‌కి ఎదురు నిల్చినపుడూ మా భావాలు వేరేమోకాని అది మా వ్యక్తిగత సత్సంబంధాలకి అడ్డు కాలేదు. రాజాజి పటం ఆవిష్కరణకిగానూ వేదిక ఏర్పాటు చేసారు. ఇండియాకి రాజాజి మొదటి, చివరి బ్రిటిష్ గవర్నర్ జర్నల్‌గా చేసారు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటం ఆవిష్కరించారు. ప్రసంగాలు జరిగాయి. నా ఆనందం అంబరాన్ని అంటింది. అదో అద్వితీయమయిన మరపురాని క్షణం. నాకత్యంత ప్రియ మిత్రులయిన నెహ్రూ, రాజాజీల సమక్షంలో ఆనాడు నేను ఉద్వేగభరితక్షణాల్ని గడిపాను.

తర్వాతి రోజుల్లో కొన్ని విషయాలు నన్ను బాధించాయి. ప్రాథమిక ఆదర్శాలు గాలికొదిలేసినట్లు అనిపించింది. అవినీతి – బంధుప్రీతి పెరిగిపోయాయి. సత్యం దుమ్ముకొట్టుకుపోయింది. సమర్థులు పీడించబడి వేధింపులకి గురయ్యారు. అసహాయత ఆవరించిన నేను కాంగ్రెస్ పార్టీ చట్టసభకి రాజీనామా చేసాను. ప్రియమిత్రుడూ, అభిమాన నాయకుడు, ప్రధానమంత్రి నెహ్రూకి బహిరంగ లేఖ రాసాను. ఆఖరి ప్రసంగాన్ని అసెంబ్లీలో ముగించి అవతలికి వచ్చేసాను.

రాజకీయంగా నెహ్రూ నుండి వేరుపడటం నన్ను బాధపెట్టింది. భావోద్వేగపరంగా తనతో కలిసే ఉన్నాను. చివరి ఉపన్యాసం ముగించి సభ నుండి వెళుతున్నపుడు నా మిత్రుడు వైద్యనాధ అయ్యర్ మొహంలో కనబడిన చూపు నేనెప్పటికీ మర్చిపోలేను. బలీయమయిన ప్రభుత్వాన్ని నేను ఒంటరిగా ఎదుర్కోవడానికి సిద్ధపడ్డాను. అనేకమంది అది ఆత్మహత్యా సదృశ్యమని తలిచారు. బహుశా కావచ్చు, కాకపోనూవచ్చు.

అధ్యాయం - 11

దశలు

జీవితమనే వర్ణచిత్రంలో ఎన్ని దశలో అన్నే ఆశలు, మరెన్నో నిరాశలు. సుఖదుఃఖాల సమ్మిళితమే కదా జీవితం. రవీంద్రనాథ్ టాగోర్ మా కుటుంబానికి ఆత్మీయ మిత్రులు. అప్పుడపుడూ ఇంటికొచ్చి ఉంటుండేవారు. టాగోరు, గాంధీ ఇద్దరిలోనూ సారూప్యాలు, విరుద్దాంశాలు రెండూ అగుపిస్తాయి. ఒకసారి ఆండ్రూస్‌నాకు ఇంగ్లీషు కవిత్వం చెబుతున్నాడు. ఇంతలో టాగోరు కవిత వచ్చింది. ఒక భాగం తీసి దానిని వివరించాల్సిందిగా అప్పుడు మా అతిధిగా ఉన్న టాగోర్‌ని అడగమన్నారు. నేను భయంభయంగా ఆయన గది దగ్గరకి వెళ్ళాను. చూసి ఏం కావాలని అడిగారు, చెప్పాను. పుస్తకం తీసుకుని ఆ భాగం చదివారు. నమ్మండి, ఆ కవితా గానం ముందు ఎంతటి మధురమైన సంగీతమయినా, ఎంతటి సౌందర్యరాశి స్త్రీ నవ్వైనా దిగదుడుపే. సాక్షాత్తూ స్వర్గం నుండి వెలువడినట్లు ఆ గానం ఆవహించింది. కొద్దిసేపే చెప్పారు. ఆయన కవిత్వంపై పది సంపుటాల వ్యాఖ్యానం చదివిన తర్వాత ఇప్పటికీ ఆయన్ని నేను పూర్తిగా అవగతం చేసుకోలేకపోయానని చెప్పక తప్పదు.

అలాగే ఒక అద్భుతమయిన దినాన మధ్యాహ్నం వేళలో చుట్టూ పర్వతాలు పచ్చగా పరుచుకుని ఉన్న తోటలో కూర్చొని పాఠాలు చదూతున్నాను. అటుగా వెళుతున్న టాగోర్ ఆగి ఏం చేస్తున్నావని అడిగారు. పాఠాలు చదూకుంటున్నానని బదులిచ్చాను. "ఇంత అందమయిన రోజుని ఆస్వాదించకుండా, ఏంటీ క్రూరత్వం" అంటో అప్పటికప్పుడే అమ్మానాన్నలకి కబురుపంపారు. ఆ రోజు నా పాపిష్టి చదువు కాకుండా ప్రకృతి ఒడిలో పక్షుల బడిలో పచ్చటి సూర్యకిరణాల జడిలో సహజంగా తడిసిముద్దవుతూ తరించాను. ఒక విశ్వవిద్యాలయంలో కళలు, ప్రకృతి శాస్త్రంలో పట్టా పొందడానికెంత నేర్చుకోవాలో అంతా ఆరోజు సొంతం చేసుకున్నాను.

పారిస్‌లో ఒకసారి రాత్రి భోజనం చేస్తున్నప్పుడు మాటలమధ్య మిత్రుడు డ్యూక్ చెప్పిన సంగతులు గుర్తొస్తున్నాయి "నేనెదయితే నేర్చుకున్నానో అదంతా స్కూలు, కాలేజీ విడిచిపెట్టేసాక మాత్రమే నేర్చుకోగలిగాను" అన్నాడు. ఎంత నిజమో కదా! డ్యూక్ చాలా గొప్ప వ్యక్తి. యువరాజు, ప్రేమికుడు, తత్వవేత్త. విన్‌స్టన్ చర్చిల్‌కి చాలా సన్నిహితుడు. ఒకసారి బరోడా మహారాజు ప్రతాప్‌సింగ్ గాయక్వాడ్‌తో విందు ముగిసాక అక్కడి సేవకులతో కూడా కరచాలనం చేసి కృతజ్ఞతలు చెప్పారు డ్యూక్. అంతటి ఆదరణీయుడు. చాలా ఉన్నతమయిన నిరాడంబరుడు. అప్పుడప్పుడూ సొంత అహంకారాలు, ఆడంబరాలు

ప్రదర్శించుకోవడానికి ప్రాథమిక మర్యాద, సభ్యతాసంస్కారాల్ని విస్మరించే మన మంత్రులు, రాజకీయ నాయకుల ప్రవర్తనను అంతటి మహనీయుడి ప్రవర్తనతో పోల్చి విస్తుపోతుంటాను. డ్యూక్ జన్మతః మహారాజు. వేల్స్ యువరాజుగా ప్రఖ్యాతుడు.

గాంధీజీతో మొదటి సమావేశాన్ని ప్రస్తావించాలి. ఆయనప్పుడు బొంబాయిలోని జూహూలో ఉన్నారు. నేనూ కుటుంబంతో వేసవి విడిదికని కాశ్మీర్‌వెళుతూ ఆయన్ని కలవాలనుకున్నాం. రాజాజీ గాంధీజీకి చేర్చాల్సిందిగా ముఖ్యమైన వ్యక్తిగత సమాచారం అందించారు. నాకు, మా కుటుంబానికీ ఆప్తురాలు, భారతీయ గానకోకిల సరోజినీదేవి మమ్మల్ని గాంధీజి దగ్గరకు తీసుకుని వెళ్ళారు. ఆయన తన మానవీయమయిన చిరునవ్వుతో రెండు చేతులు జోడించి నమస్కారం చేసారు. నేనూ, నా భార్య ప్రణమిల్లి ఆయనకి పాదాభివందనం చేసాం. జీవితంలో మొట్టమొదటిసారి వ్యాకులపడ్డాను. ఆ ఆదుర్దాకి కారణం వివరించలేను. బహుశా మహాత్ముడి ముందు నేను మామూలు వ్యక్తిననే భావం ఆవరించిందేమో. ప్రఖ్యాత పత్రిక ది హిందూలో ఈ సంగతి గురించి రాస్తూ చక్రవర్తి ఎదుట కూడా మహాత్ముడెదుట పడిన వ్యాకులత పడకపోయుందునని రాసాను. గాంధీజి మౌనంగా ఉన్నారు. మా ఆవిడ చేతి కట్టేమిటని అడిగితే, సైకిలు మీద నుండి పడిపోయిందని చెప్పాను. ఆయన మెరుస్తున్న కళ్ళతో "పెంకె పిల్లా సైకిలెక్కి చెయ్యెందుకు విరగ్గొట్టుకున్నావని" చూపుల్తోనే ప్రశ్నించారు. ఆయన మద్రాసులో ఉన్నపుడు కూడా వెళ్ళి కలిసి ఆయన విరాళాల సేకరణకి మావంతు తోడ్పడ్డాం. ఆ మొత్తాన్నీ ఆయన బహిరంగంగా ప్రకటించారు కూడా. సాధారణంగా ఆయన హిందీలోనే మాట్లాడేవారు. కానీ ఇంగ్లీషు అద్భుతంగా మాట్లాడగలరు. నాకు తెల్సీ శ్రీనివాసశాస్త్రిగారే తర్వాత మళ్ళీ అంత గొప్ప ఆంగ్ల భాషలో సంభాషించగలరు. గాంధీజికి హిందీ ప్రచారానికి అభ్యంతరం. ఆయన హిందుస్తానీ అనేవారు. ప్రపంచంలోని గొప్ప విప్లవకారుల్లో ఆయనొకరు. అత్యంత మర్యాదస్తుడూ, సంస్కారి. నేనాయనతో వచ్చీరాని హిందీ మాట్లాడ్డానికి ప్రయత్నిస్తూ తంటాలు పడి ఆఖరికి ఆంగ్లంలోకొచ్చేవాడిని. ఆయన ఈ అవస్థంతా ముసిముసి నవ్వులతో చూస్తూ నన్నూ, మా ఆవిడని ఆటపట్టిస్తుండేవారు. మా అమ్మపేరుతో నాన్నగారు దాతగా నిర్మించ తలబెట్టిన బాలికా పాఠశాల శంఖుస్థాపనా సభ కోసం ఒక ఫోటోమీద ఆయన సంతకం కావాలన్నాను. ఆయన యథాప్రకారం గుజరాతీలో నా మామూలు నాకిచ్చేయమన్నారు. నాకు గుర్తున్నంతవరకూ స్వభాషలోనయితే ఐదు రూపాయిలు ఇంగ్లీషులో సంతకం పెట్టాలంటే ఏడు రూపాయలు వసూలు చేసేవారు. అలా ఆయన ఆటోగ్రాఫ్‌ల మీద వచ్చిన మొత్తం హరిజన సేవానిధికి తరలించబడేది. గాంధీ డబ్బుని జాగ్రత్తగా ఖర్చుపెట్టే కోమటి. ఆయనకాయనే ఆ మాటలనేవారు. ఆ నా

గురువు ప్రభావంతో ఐదు రూపాయిల సంతకమే తీసుకున్నా. ఎంతైనా, గుజరాతీ గాంధీ మాతృభాష మరి. ఇక్కడ మరో విషయం చెప్పాలి. ఆ శుభకార్యం కోసమని గాంధీజీని మద్రాసు నుండి తీసుకురావడం కోసం ఆరువందల మైళ్ళ దూరానికిగానూ ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు ఖర్చంతా నేనే భరించాను. గాంధీజీని చివరిసారి ఆయన హత్య జరగడానికి కొద్దిరోజులముందే ఢిల్లీలోని బిర్లా మందిరంలో కలిసాను. అప్పుడే హిందూ–ముస్లిం అల్లర్ల నేపథ్యంలో ఆయన పంజాబ్ పర్యటన గురించి అడిగాను. ఆయన బాధాకర వ్యక్తి. అధికారం బదలాయించబడినప్పుడు ఆయన మాలో ఎవరితోనూ కల్సి లేడు. దేశాన్ని పాలిస్తున్న ఆయన ప్రియశిష్యుడితో కూడా లేడు. మతఘర్షణల మధ్య శాంతినింపే క్రీస్తులా ఒంటరిగా సర్వమత సమైక్యత కోసం నౌఖాలిలో పాటుపడుతున్నాడు. ఎంత వింత మనిషి!

సినిమా చూసి వస్తుంటే గాంధీజీ హత్య గురించి విద్యార్థులెవరో నాకు చెప్పారు. స్థాణువైపోయాను. దేశం, విశ్వం స్తంభించిపోయాయి. గొప్ప జ్యోతి ఆరిపోయింది. అక్కడే కూలబడి వెక్కివెక్కి ఏడిచాను. దేశమంతా రోదించింది. ఆ వేదనతో ఎవరితోనో అన్నాను, 'మనం ఆయనకి తగం, అందుకే చంపుకున్నాం'. నెహ్రూ గురించి ఆలోచించాను. దేశమంతా ఆయన అస్తికలూ, బూడిదా తిరుగుతున్నప్పుడు కూడా నాదొకటే ప్రశ్న : అస్తికలు పవిత్రం చేయగలుగుతాయా లేదా శిలల్లా మారతాయా అని నాలో నేనే తర్కించుకునేవాడ్ని.

నెహ్రూ ఎవరికీ అంతుబట్టని ఆకర్షణీయ జీవి. అతడ్ని తెలుసుకోవడమంటే గొప్ప అన్వేషణ ఆరంభించడమే. ఎదురుగా ఆయన్ని పొగిడే ఎందరో వెనక తెగుడుతారు. పదవి సమస్య కాదు. ప్రధానిమంత్రిగా ఉన్నా లేకున్నా ఆయనకి లక్షలాది అభిమానులు ఉన్నారు. విజయాలు, పరాజయాలన్నింటిలోనూ నిజాయితీ, మానవతతో తనదయిన ముద్ర వేసాడాయన. ఒక్క పరాజయం కూడా లేకుండా ఉండేందుకు ఏ మనిషీ దేవుడు కాదు. ఆ మాటకొస్తే దేవుళ్ళలో కూడా పరిపూర్ణులెవరూ లేరు. అనేక విషయాలు నెహ్రూతో కూడా నేను చర్చిస్తుండేవాడిని. ఆయనో గొప్ప ఆత్మవిమర్శకుడు. స్నేహితుడని కాదు కానీ వర్తమానంలో ఏ రాజకీయ నాయకుడి ఆలోచనలు, ఆచరణల పట్లనా నాకు ఆరాధనాభావం ఉన్నదంటే అది నెహ్రూ మీదనే. సమకాలీన చరిత్ర నెహ్రూకి సముచిత స్థానం ఇవ్వలేదు. ఆయన్ని మొదటిసారి పి.ఇ.ఎన్. P.E.N. (Poets, Esseists, and Novalists) కాన్ఫరెన్స్‌లో కల్సి పరిచయం చేసుకుని ఒక మిత్రుడిచ్చిన లేఖ ఇచ్చాను. ఆయన సోదరీమణులు కృష్ణా, విజయలక్ష్మిల మిత్రుడ్నని చెప్పాను. అలా మొదలయిన మా బంధం త్వరలోనే బలపడింది.

రాజాజీ గురించి ఈసరికే చెప్పేసాను. మామూలుగా ఆయనింటికి చెప్పకుండానే సరాసరి వెళ్ళే చనువు ఉండేది. ఒకసారి ఏదో పనిమీద ముందుగా కలవడానికి అనుమతి కోసం రాస్తే ఏవో కారణాలతో నిరాకరిస్తూ జవాబు వచ్చింది. తర్వాతెప్పుడో ఏదో పెళ్ళిలో కల్సినపుడు ఆ విషయం రాజాజీ నవ్వుతూ భుజంపై చెయ్యేసి గుర్తుచేసారు. ఆయన నిర్దాక్షిణీయంగా విమర్శించేవారు, విమర్శించుకునేవారు. ఆచార్య కృపాలనీ, ఆయన బార్య సుచేత కూడా మా కుటుంబ మిత్రులు. కృపాలనీ గొప్ప మేధావి. జయప్రకాశ్‌నారాయణ్, అశోక్‌మెహతా, లోహియాల మేధస్సుపై కూడా నాకు గౌరవభావముంది. ఒకసారి ఢిల్లీలో దాదా కృపాలనీ పక్కన నడుస్తూ అన్నాను, 'బతుకుజీవుడా మనం చివరి దశకొచ్చేసాం' అనీ, దానికాయిన వెంటనే జవాబిస్తూ, 'అవును, అందరం చనిపోతాం' అన్నాడు.

ఒకసారి జయప్రకాశ్ నారాయణ్‌ని కలిసాను. ఆయనతో నా భావాలు పంచుకుంటూ మనం 'వాదాలు' (isms) కి అతీతమయిన దశకొచ్చామనేది నా అభిప్రాయం అంటూ, కేపిటలిజం, సోషలిజం, కమ్యూనిజం వంటి పిడివాదాల వెంట పడకుండా సమస్యకి సరైన శాస్త్రీయ ఆచరణాత్మక పరిష్కారాన్ని కనుగొనడం పై దృష్టిపెడితే బాగుంటుందన్నాను. ఆయన నాతో ఏకీభవించాడు. ఆయన గొప్ప సోషలిస్టు. ఆయన ఉదారత, ఆదర్శవంతమయిన వ్యక్తిత్వం నన్ను ఆకట్టుకున్నాయి. భావోద్వేగభరితమయిన మా ఇరువురి ప్రాపంచిక దృక్పథాల్లో సారూప్యాలు కనిపించాయి.

పాకిస్తాన్ వ్యవస్థాపకుడు మహమ్మదాలీ జిన్నా ప్రకాశవంతమయిన వ్యక్తి. ఆయనది అరుదైన వ్యక్తిత్వం. ఆయన అనురాగాన్ని, నమ్మకాన్ని చూరగొన్నాను. మేం కలిసి తింటూ ఆలోచనలు పంచుకునేవాళ్ళం. జిన్నా అజేయమయిన అగ్ని పర్వతం వంటి వ్యక్తి. గాంధీతో హిందూ–ముస్లిం సమస్యని గురించి జిన్నా చర్చలప్పుడు నేనాయనకి కాశ్మీర్ నుండి లేఖ రాసాను. దేశ చరిత్రలో అదో దురదృష్టకరఘటన. నేనా లేఖలో వాళ్ళిద్దరూ లక్షలాది హిందూ ముస్లిముల హృదయాల్ని అర్ధం చేసుకుని ఒక ఒప్పందానికి రావాలని ఆకాంక్షిస్తూ, దేశం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని మీవైపు చూస్తోందని రాసాను. దానికి జిన్నా జవాబు కూడా రాసాడు. కానీ, చర్చలు విఫలమయ్యాయి. వార్తాపత్రికలు ఆ విచారకర వార్తని ప్రపంచమంతా ప్రకటించాయి. ఐతే, గాంధీ, జిన్నాలు ఒకర్నొకరు హత్తుకున్న చిత్రం కూడా ముద్రించాయి. తర్వాత జిన్నాతో నేనా ఫోటో సంగతి ప్రస్తావించగా, అంతకంటే నాకు గత్యంతరం లేదన్నాడు. గాంధీజి అలాంటి విపత్కర కాలంలో అలాంటి చిత్రం కూడా సాయపడుతుందనుకుని ఉంటాడు. విభజన తర్వాత కూడా జిన్నాని ఇరుదేశాలూ పరస్పరం కల్సి ముందుకు సాగవచ్చు కదాని కదిపాను. దానికాయన 'తప్పకుండా' అంటూ తడుముకోకుండా చెప్పాడు.

అధ్యాయం-12

మరికొన్ని దశలు

వి.కె. కృష్ణమీనన్ అసాధారణ మిత్రుడు. ఎప్పుడూ ఏదో వివాదంలో చిక్కుకు నుండేవాడు. లండన్ హై కమిషన్‌లో ఆయనున్నప్పుడు అప్పుడక్కడే ఆక్స్‌ఫర్డ్‌లో చదువుతున్న మా పెద్దబ్బాయి బాగోగులన్నీ చూసుకున్నారు. మా కుటుంబం అంటే ఆయనకెంతో ప్రీతి.

విజయలక్ష్మీపండిట్‌తో నా స్నేహం ఆమె మా అతిథిగా ఉన్నప్పుడు జరిగింది. అఖిల భారత మహిళా సభకి ఆమె అధ్యక్షురాలిగా ఉండగా నా భార్య ఆహ్వానసంఘం అధ్యక్షురాలు. అలాగే ఇందిరాగాంధీని నేను ఆరాధించేవాడ్ని. ఆమె నిజంగా గొప్ప ఆకర్షనీయమయిన స్త్రీ. ఆమె మోములో నాకు సవాళ్ళని ఎదుర్కొనే ధీరత్వం కనిపిచేది.

అద్భుతమయిన మహామనిషి అరవిందుడి ప్రభావం నాపై విచిత్రంగా పడింది. ఒకసారి కలలో అంతకుముందెన్నడూ చూడని రూపం కనిపించింది. తర్వాతెప్పుడో మిత్రుడు బరోడా మహారాజుతో కల్సి భార్యా నేను పాండిచ్చేరి వెళ్ళి ఆయన ఆశీస్సులు పొందాం. నేనమితంగా ఆకర్షితుడ్నయ్యాను. కొన్ని దివ్యానుభవాలని వర్ణించలేం. అలాంటి వర్ణింపశక్యంకాని అనుభవం అది.

కొద్దికాలంగా నేను నా గురువుకోసం అన్వేషిస్తున్నాను. ఎంతమంది సిద్ధుల్ని కలిసినా నాకు ఆ భక్తిభావం కలగలేదు. ఒకసారి నేను విలాసాల్లో మునిగి ఉన్నా కానీ నా మనసు మరెక్కడో ఉంది. అకస్మాత్తుగా నేనో రహస్య స్వరానికి స్పందిస్తున్నాననే సంగతి అర్థమయింది. అదే నా గురువు పిలుపు, అతడే అరవిందుడు. మొత్తానికి నేను నిర్ణయించుకున్నాను. మద్రాసు నుండి తిరిగి వస్తుండగా మెరుపులా నాకేదో తట్టింది. ఆనాడు నాకు స్వప్నంలో కనిపించిన వ్యక్తి అరవిందుడే. వెంటనే ఆయనకి లేఖ రాసాను. ఆయన జవాబు రాసారు. నన్ను శిష్యుడిగా స్వీకరించినట్లు చెబుతూ నాకొచ్చిన స్వప్నం దృష్టికోణమన్నారు.

శ్రీ అరవింద ఆశ్రమం
పాండిచ్చేరి
ఆగష్టు 29, 1949

శ్రీ ఆర్.వి.ఎం.జి. రామరాజు
పిఠాపురం యువరాజు గారికి
ప్రియ మిత్రుడా

అరవిందులవారికి రాసిన లేఖకి ఆయన ప్రత్యుత్తరం :

1. మిమ్మల్ని ఆయన శిష్యునిగా అంగీకరించడం జరిగింది.

2. మీకు వచ్చిన స్వప్నం నిజంగా ముఖ్యమైనది. అది ఉత్త కలకాదు, సత్యదృష్టి.

3. మీరు నమ్మే మంచి చెడూ, అందం – అందవిహీనత ఇవన్నీ మనిషి తన జీవితాన్ని నిర్దేశించుకోవడం కోసం ఉపయుక్తమయ్యేవి. ఉన్నతమయిన చైతన్యాన్ని అతడు కనుగొనగలిగినప్పుడు, సత్యాన్ని గ్రహించడానికి అవసరమైన స్మృతిలోకి ప్రవేశిస్తాడు. భగవంతుడి అస్తిత్వానికి సంబంధించిన ఆంతరికానుభవం కూడా సాధన ద్వారానే తేలుతుంది. ఆ వెలుగుని చూడగలిగితే పరమసత్యం సన్నిధి ప్రాప్తిస్తుంది.

4. ప్రార్థన గురించిన మీ భావన సరైనదే. అదే ప్రార్థనకి సంబంధించిన ఉన్నత దశ. వ్యక్తిగతమైన మరో మార్గం కూడా వాంఛనీయమే. ప్రార్ధనలన్నీ మనల్ని ఆ దైవానికి మరింత చేరువ చేసేందుకు ఉపకరించేవే.

మీరు ప్రస్తావించిన అవాంతరాలన్నీ సాధనలో సాధారణంగా తలెత్తేవే, భౌతికమయిన ఈ జడత్వాన్ని జయించడం ద్వారానే క్రమంగా చైతన్యం సిద్ధిస్తుంది.

భవదీయ

కార్యదర్శి

నళినీ కాంత్ గుప్తా — **శ్రీ అరవింద ఆశ్రమం**

కార్యదర్శి — పాండిచ్చేరి

ఈ సంఘటన తర్వాత నేను తిరుపతి వెళ్ళాను. నేనెక్కువగా దేవాలయాలకి వెళ్ళను. చాలా కొద్దిపాటి గుళ్ళకే వెళ్ళాను. తిరుపతి కొండమీద వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నాను. విగ్రహం రూపంలేని భగవంతుడి శక్తిస్వరూపం. ముందుగా ఏ రకమైన భావమూ ఏర్పర్చుకోకుండానే నేనా గుడికెళ్ళాను. కానీ, నా కళ్ళు తెరుచుకున్నాయి. ఆ అనుభవాన్ని వర్ణించడం వల్లకాదు. ఆ కలియుగ దైవం ముందు చేతులు కట్టుకుని మోకరిల్లాను. అన్వేషణకి అతీతమైనది దైవం.

మాజీ టర్కీ సుల్తాను కుమార్తె రాణీ దూరూషేష్‌వర్ నాకు ఆప్తురాలు. హైద్రాబాద్ నిజాం వారసుడిని ఆమె వివాహమాడింది. అతడు నన్ను సొంత సోదరుడిగా భావించేవాడు. మా ఇరు కుటుంబాలు ఆప్యాయనురాగాలకి మారుపేరుగా ఉండేవి. ఒకసారి హిమాలయాలకి పోయి తపస్సు చేసుకుంటానని ఆమెతో అన్నాను. దానికామె, నేనూ ఏదోకరోజు ఏ మునీంద్రుడి ఆశీస్సుల కోసమో అక్కడికి వస్తానేమో అంది. నేను స్పందిస్తూ, భగ్న పడాలనుకోవట్లేదన్నాను. ఆ మాటలలా నవ్వులతో ముగిసాయి.

హిమశిఖరాల సౌందర్యం నన్నెప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది. రోజువారీ తిండికోసం కాషాయ వస్త్రాలు ధరించి జీవించడం వింతగా తోస్తుంది నాకు. రాజయిన హర్షుడు తన యావదాస్తినీ ఐశ్వర్యాన్నీ త్యజించి సొంత సోదరి వద్ద దానం కోసం భిక్షాపాత్ర పట్టలేదా? బుద్ధుడు అరణ్యాల వెంబడి ప్రయాణిస్తూ భిక్షువుగా బిచ్చగాడి రూపంలో సంచరించలేదా? ఆ దృశ్యాలన్నీ నాలో కదిలాయి. ఆ మాటకొస్తే హిమాలయాల కంటే మియామిబీచ్ మొదలుకుని అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో నేననుభవించిన విలాసాలు విశేషాలే అధికం. స్పానిష్ రాయబారి, అల్ఫ్రార్డ్ క్రవ్, అర్జెంటీనా అధ్యక్షుడి భార్య ఎవిటాపేరన్ వంటి మిత్రులే ఎక్కువ. ఒకసారి కెనస్ నుండి రోమ్ ప్రయాణంలో పరిచయమయిన వింత మనిషిని ఎప్పుడూ మర్చిపోలేను. అతనితో సోషలిజం, ప్రజాస్వామ్యాల పైన నా నమ్మకం ఇంకా సడలలేదని చెప్పాను. మీరు చదివింది ఆక్స్‌ఫర్డులోనా? అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్న నన్ను చాలామంది అడిగారు. నేను 'కాద'ని చెప్పాను. దానికతను, 'కానీ ఆ ప్రభావం కచ్చితంగా మీపై ఉండుండాలి' అన్నాడు. నేనొప్పుకున్నాను. వెంటనే అతడు 'అదీ సంగతి' అంటూ తేల్చేసాడు. నేనీ సంభాషణ మిత్రుడు ప్రొఫెసర్ ట్రివర్ రోపర్‌కి, అతని ద్వారా ఛాన్సిలర్ హెరాల్డ్‌మెక్ మిలన్‌కి చేరవేసాను. ఇంకా శ్రీలంక గవర్నర్ జర్నల్ సర్ వొలివర్ గూనితిల్లేక్ మొదలుకొని నా ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిరక్షించేందుకు కూడా లండన్ లోని డాక్టర్ లార్డ్ హార్డర్, సర్ రైనాల్డ్ వాట్సన్ జోన్స్, జి.డి. కిర్స్‌లీ, న్యూయార్క్‌లో రిచర్డ్ ఫ్రైబర్గ్, ఫిలిప్ విల్సన్ వంటి మిత్రులుండేవారు. ఎప్పటికప్పుడు నా శరీరాన్నీ, మనసుని ఆరోగ్యంగా ఉంచుకోడానికి చేసే పోరాటంలో భాగమే ఇదంతా!

ఒకసారి న్యూయార్క్‌లోని ఒక కారుడ్రైవరుతో మాట్లాడుతున్నాను. ఆ సాయంత్రం అతను కుటుంబంతో గడపాలనుకుంటున్నానని చెబుతూ, 'అదనపు డబ్బుతో నేనేం చేసుకుంటాను? ఈరోజుకి చాలినంత సంపాదించాను' అన్నాడు. నా జీవితంలో అదో మహత్తరమయిన సందేశం. ఒకసారి అలాగే లండన్‌లో ఒక టాక్సీడ్రైవర్‌కి నా రెండో కొడుకు పెద్ద మొత్తంలో టిప్ ఇస్తే, దానిని తిరిగి ఇచ్చేస్తూ 'అబ్బాయీ, నీ డబ్బుని వృధా చేయకు' అన్నాడు. అంతకుమించి ఔన్నత్యం గల వ్యక్తులెక్కడుంటారు?

ఒకసారేదో పనిమీద నేనో ప్రమాదకరమయిన చోటికి వెళ్ళాల్సి వచ్చింది.. ఒక శ్రేయోభిలాషి సూచన మేరకు నా ఫిస్టల్‌ని కూడా తీసికెళ్ళాను. అంతకు ముందెన్నడూ తుపాకీ నేను వాడలేదనే ఆలోచన అప్పుడు హఠాత్తుగా వచ్చింది. ఏం జరగలేదనుకోండి, నా పని పూర్తిచేసాను.

మైసూరు మహారాజా, అలాగే ట్రావెన్‌కోర్ మహారాజా కుటుంబాలు మాకెంతో ప్రియమైనవి. అలాగే పేద ప్రజానీకంగా చెప్పబడే వారిలో కూడా నాకెందరో

మిత్రులుండేవారు. ఆత్మలోనూ, ఆలోచనల్లోనూ వాళ్ళు ఎంతో ఉన్నతులు. అద్భుతమయిన ప్రేమాభిమానాల్నీ, కవిత్వాన్నీ, సంగీతాన్నీ, తత్వజ్ఞానాన్ని వాళ్ళు నాకు అందించేవారు.

ఒకసారి భారీ వర్షంలో నేను నా రోల్స్‌రాయిస్‌లో వెళ్తున్నాను. ఆ కారుమీద చిన్నపాటి మచ్చ పడ్డా నేను సహించేవాడిని కాను. రోడ్డుపక్కగా తడుస్తూ, రగ్గు కప్పుకుని పోతున్న పెద్దాయన దగ్గర కారాపి లోపలికి ఆహ్వానించాను. మొదట నిరాకరించినాయన, మొత్తానికి కారెక్కాడు. అతడి గమ్యస్థానానికి చేర్చాను. రెండు చేతులూ జోడించి సెలవు తీసుకున్నాడు. అర్థం చేసుకోవాలే కానీ ఆ కృతజ్ఞతే ఒక మహాగ్రంథం. ఖరీదయిన స్నేహితులతో చేసే కులాసా ఐన షికారులకంటే ఇలా మరొకరికి సహాయపడే యాత్రల్నే నేను ఇష్టపడతాను. అలా ఎన్నోసార్లు బీదలకి లిఫ్ట్ ఇచ్చాను. ఒకసారలాంటి లిఫ్ట్ ఇవ్వడం ఏమంత భాగ్యం కాదు కదా.

ఒకసారి ఉత్సాహం ఆపుకోలేక నా రచనల్ని బెర్నార్డ్‌షాకి పంపించాను. వాటినాయిన చెత్త బుట్టలో విసిరేసి ఉంటాడని నా విశ్వాసం. ఆయన్ని కలవాలని తీవ్రంగా అనుకునేవాడ్ని. ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేసా కానీ అంతలోనే ఆయన కాస్త తొందరగా మరణించాడు. నా భార్యా నేనూ వోసారలాగే న్యూయార్క్‌లో ఐన్‌స్టీన్‌ని కల్సుకోడానికి వెళితే వారం వరకూ ఆయనకి తీరికలేదని తెల్సింది. నా బిజీ వల్ల కలవలేకపోయా. తర్వాత ఆయన గతించారు. నన్ను నేనెప్పటికీ క్షమించుకోలేను.

దక్షిణాఫ్రికా ప్రధానమంత్రి బంధువు ఒకామె లండన్‌లో ఒక వేసవిలో పరిచయమయింది. మంచి స్నేహితులమయ్యాం. ఒకసారి ఇండియా రావాలనేది. తర్వాత కొద్ది రోజులకి ఆమె తల్లి వద్ద నుండి నాకో లేఖ వచ్చింది. విమాన ప్రమాదంలో నా స్నేహితురాలు చనిపోయిందని దాని సారాంశం. ఆమె ఇండియా రాకడ కలగానే మిగిలింది.

మయూర్‌భాంజ్ మహారాణి సుచారు దేవి నాకు నిజమయిన తల్లివంటిది. గొప్ప బ్రహ్మ సామాజికులయిన కేశవచంద్రసేన్ కూతురామె. చాలా రోజుల తర్వాత ఆమెని చూడ్డానికి వెళ్ళాను. 'రామా, నిన్ను మళ్ళీ చూడలేనేమో' అందామె. నేను గంభీరంగా, 'అమ్మా, నేను మళ్ళీ చూడ్డానికి వస్తా' నన్నాను. ఏడాది తర్వాత వెళితే ఆమెచాలా నీర్సంగా, జబ్బుపడి ఉంది. 'ఈరోజు సాయంత్రం చూడ్డానికి రాగలవా' అనడిగింది. 'నిజంగా రాగలవా' అంటే, 'సిస్సీ' (ఆమె కూతురు)ని ఫోన్ చేయమనండి. రాడానికి చూస్తా' నన్నాను. ఆమె దత్త పుత్రుడు సాయంత్రం ఫోన్ చేస్తానన్నాడు. ఏ ఫోనూ రాలేదు. ఐనా నేను వెళ్ళాను. అక్కడెవరూ లేరు. ప్రశాంతంగా విశ్రాంతి తీసుకుంటున్న ఆమెని లేపడం ఇష్టం లేక వచ్చేసాను. నేను మద్రాసు తిరిగొచ్చిన రెండ్రోజులకి సిస్సీ నుండి టెలిగ్రాం అందింది, ఆమె అమ్మ / నా తల్లి ప్రశాంతంగా కన్నుమూసిందనీ.

అధ్యాయం-13
బూడిదలో పోసిన పన్నీరు

రాజకీయంగా నేను ఎడంగా ఉంటూ వచ్చినప్పటికీ కాంగ్రెస్‌లోంచి బయట కొచ్చేసాక కూడా నెహ్రూకీ, కాంగ్రెస్‌కి నా హృదయం సన్నిహితంగానే మెలిగేది. లోతుగా పాదుకుపోయిన వేళ్ళని అంత త్వరగా విడిచిపెట్టలేం. అయినప్పటికీ నా విలువలు నేను పాటించేవాడ్ని. కాంగ్రెస్ నుండి తప్పుకున్నప్పటికీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేసేవాడ్ని. కాంగ్రెస్‌ని విడిచిన రెండేళ్ళకి నెహ్రూ ప్రస్తావన మళ్ళీ తీసుకుని రావడంతో తిరిగి కాంగ్రెస్‌లో చేరాను. నా రాజీనామా లక్ష్యం నెరవేరింది. పెద్ద విజయం కాకపోవచ్చు కానీ నా అహాన్ని తృప్తిపరిచింది. ఇప్పుడదంతా ముగిసింది. తర్వాత పార్లమెంటు అభ్యర్థిగా నిలుస్తానని పార్టీకి రాసాను. ఐతే, నన్ను అభ్యర్థిగా ప్రకటించలేదు. రాజకీయాలనేవి గతిశీలమైనవి. వాటికంటూ ప్రత్యేక నియమాలున్నాయి.

నాకు కాంగ్రెస్, ప్రజా సోషలిస్ట్, కమ్యూనిస్ట్ పార్టీలన్నింటిలో మిత్రులున్నారు. కొద్దిమంది స్వతంత్ర అభ్యర్థిగా నిలబడమని సలహా ఇచ్చారు. నేనా సలహా పాటించలేదు. అవకాశవాదం నా గుణం కాదు. ప్రజాస్వామ్యంలో పార్టీలు మారడం సహజమే కావచ్చుగానీ అంతిమంగా అది అవకాశవాదం కాకూడదని గ్రహించాలి. సన్నిహితులు, మిత్రులకి కూడా కాంగ్రెస్‌కే ఓటేయమని చెప్పాను. ఐతే, మా నియోజకవర్గంలో కమ్యూనిస్టు అభ్యర్థి మా సమీప బంధువు గెలిచాడు. కాంగ్రెస్ ఓడిపోయింది.

రాజకీయ జ్ఞాపకాలు తక్కువుండి బతికిపోయాను కానీ లేకుంటే ఎన్ని కుట్రలు – కుతంత్రాలో. జీవితం జగన్నాధుని రథం వంటిది. ఈ ఆటలో అన్నీ మనమే చేస్తాం, గెలుస్తాం, ఓడిపోతాం. చట్టబద్ధంగా మా వర్గాన్ని రద్దుచేయడం పెద్ద దెబ్బ. ఆర్థికంగా అది మాకు చావుదెబ్బే. నేనీ వర్గానికే చెందుతాను. కానీ వేరే దారి లేదు. నేనే కనుక భారతదేశ ప్రధానినయితే నియంతగా నా వర్గాన్ని రద్దు చేసేవాడ్ని. బద్దలవ్వడానికి సిద్ధంగా ఉన్న పరిస్థితులు విప్లవాత్మక మార్పుని ఆశిస్తాయి. ఇక్కడలాంటి పరిస్థితులే ఉన్నాయి. బహుళ ప్రజానీకపు బాగుకోసం ఒకరిద్దరి త్యాగాలు లెక్కలోకి రావు. ఆఖరి నేపాల్ మహారాజు నాతో అనేవారు, 'అసంఖ్యాక నేపాలీ ప్రజల బాగుకోసం కొద్దిమంది రాణాలని పోనివ్వండి.' నిజమే కదా.

మా జీవన విధానాల్ని సమూలంగా మార్చుకోవాల్సి వచ్చింది. ఉన్న బట్టను బట్టే కోటు కుట్టించుకోవాలి కదా. అలా పిల్లల చదువులు పూర్తయి ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడ్డారు. తిండి, గుడ్డ గూడు ఉన్నాయి. ఇదో భయంకరమయిన యుద్ధం. కానీ ఈ మహా మార్పులో నేనో భాగమయ్యాను. నాకు ఇదో వింత అనుభవం. ఒక కొత్త ప్రపంచం నిర్మితమవుతోంది. అర్ధవంతమయిన ఒక చిరునవ్వు, ఆపదలో ఒక కన్నీటిచుక్క, ఆసరా ఇచ్చే ఒక ఆపన్న హస్తం, అవే మానవాళికి అమూల్యమైన సిరిసంపదలు.

నేను నా సొంత గూటికి వెళ్ళాను. మా పూర్వీకులు, ప్రజలు ఉన్నచోటు ఎస్టేటు రద్దయిన చాలా ఏళ్ళకి ఏదో లావాదేవీ పనిమీద వెళ్ళాను. నాకంటూ ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదు. నాన్నగారి ఆదేశానుసారం ఆయన అనుచరులు నాకడ్డంగా పెద్ద తలుపులు వేసారు. చట్టబద్ధంగా నాకు చెందాల్సిందాన్ని కూడా రాకుండా నా హక్కుల్ని రద్దు చేసారు. ఇదంతా ఎంత బాధో అంత హాస్యాస్పదం.

నేను నా బాబాయింటిలో ఉన్నా. చిన్నతనం నుండి ఆయనకి నేనంటే ఎంతో అభిమానం. ఆ కుటుంబం అంతా నేనంటే ఎంతో ఇష్టపడేవారు. చాలాకాలంగా తిననివి అక్కడ తింటున్నాను. నా రాక రహస్యంగా ఉంచాలనుకున్నప్పటికీ ఎలాగో బయటకి పొక్కింది. అంతే, తండోపతండాలుగా జనాలు రావడం మొదలెట్టారు. వందలాదిమంది, వేలాదిమందిగా పెరిగారు. నా ప్రజలు. బరువయిన హృదయంతో వాళ్ళతో కొద్దిసేపు మాట్లాడేవాడిని. ఎంతో భావోద్వేగాలకి గురయ్యేవాళ్ళు. "మళ్ళీ మమ్మల్నొదిలి వెళ్ళొద్దం"టూ అంటుంటే ఎంతో కదలిపోయేవాడిని. వాళ్ళ అభిమానపు వరదలో తడిసిముద్దైపోయేవాడిని.

మా భూములు, భవనాలు, ఇళ్ళూ, ఆస్తులన్నీ పోయాయి. చిన్న ఇంట్లో అద్దెకున్నాం. సమయానికి అద్దె ఇవ్వకపోతే యజమాని మమ్మల్ని బయటికి వెళ్ళగొడతాడు. కార్యదర్శి, గుమస్తా, ఇంటి పనివాళ్ళూ ఎవరూ లేరు. మా పని ఎక్కువగా మేమే చేసుకుంటున్నాం. కారు డ్రైవరు కూడా లేడు. ఒక్క కారే బుల్లిది ఉంది. అది కూడా అనిశ్చయంగా అన్నిటిలానే అలా పడుందంతే!

ఏమీ లేకుండా బతకడం చాలా ఖరీదు. చివరకి దుమ్ముపట్టిన రైల్వే డబ్బాల్లో కంపుకొట్టే ప్రయాణికులతో ప్రయాణం కూడా గగనమైపోయింది. నా తండ్రి నన్నూ నా కొడుకుల్ని నాశనం చేయడానికి చేయాల్సినంతా చేసాడు. ఆయన చేసిన ప్రమాణాలు, ప్రతిజ్ఞలు అన్నీ నీరుకార్చబడ్డాయి. డబ్బంతా మాయమైపోయింది. సరైన లెక్కాపత్రం లేవు. ఆ ఉన్నది కూడా అయిపోతోంది, ఇప్పటికే ఐపోయింది. బతకడానికి మిగుల్చుకోగలిగితే చాలనుకున్నాం. అసహాయత్వంతో వ్యాజెంలోకి ఈడ్చబడ్డాం. నాన్న, ఆయన

పరిగణం, ఒకామె, చివరికి ఒక సోదరి కూడా అన్ని వైపుల నుండి మాపై దాడి ప్రారంభించారు. ఇదంతా తల్చుకుని నవ్వుకుంటుంటాను. ఉన్న కాస్త సొమ్మూ న్యాయస్థాన ఖర్చులకి ఊడ్చిపెట్టుకుపోయింది. ఎటువైపు చూసినా అసహాయులుగా మిగిలాం. నా దగ్గర చిల్లిగవ్వకూడా లేకుండా ఐపోయింది. ఒక్క పూట తింటానికి రూపాయి కూడా లేదు. మొత్తానికి ఇక పోట్లాడలేక రాజీకి ఒప్పుకున్నాం. సహజంగానే ఎక్కువ డబ్బు నష్టపోయాం. నా కొడుకులకేదో కొద్దిగా మిగిలింది. అప్పులన్నీ పోగా ఒక్క పైసా నా దగ్గర మిగల్లేదు.

ఐనా ఇంకా బతకడంలో ఆనందం ఉంది చావడంలో లాగానే. ఉండడానికి రాజభవనం లేకున్నా పూరి గుడిసెలో ఉండగలననే నమ్మకం ఉంది. సంక్షేమ రాజ్యం నాకా ఉత్సాహాన్నిచ్చింది. నేను వాళ్ళకి బరువని భావించినప్పటికీ నా కొడుకులు బాగోగులు చూస్తారనే భరోసా ఉంది. చిట్టచివరి మెట్టు మీదకి పడిపోయాక ఇక దేనికీ భయపడనక్కర్లేదు, అక్కడ్నుంచి హాయిగా విశ్రాంతి తీసుకుంటూ కలలు కనొచ్చు. పెద్దదో చిన్నదో ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. కొద్దిమంది రాయబారిగా, ఇంకొద్దిమంది మంత్రిగా, వ్యాపారిగా తలిచారు. ఏదీ అవలేదు. హోటల్లో కూడా నాకు ఉద్యోగం లేదు. ఇలా అందర్నీ అడుక్కుంటున్నప్పుడు ఒక మిత్రుడు "నీకేమయితే ఎవరిక్కావాలి? మేమంతా పస్తులతో పడి చస్తున్నాం" అన్నాడు. అతడు చాలా ఆస్తిపరుడు, మంత్రి. నేనాయన మాటలతో కూడా ఏకీభవించాను. గడిచిన రోజుల్ని జ్ఞప్తికి తెచ్చుకున్నాను. ఇతరులకి నేను ఇచ్చిన ఉద్యోగాల్ని గుర్తు చేసుకుని ఆశ్చర్యపోయాను. అంతా బాగానే ఉంది, నాకే ఏమీ బాగోలేదు. చీపురు పట్టుకుని ఊడ్చే పని కూడా నాకెవరూ ఇవ్వలేదు. నాకు నేనిచ్చుకునేవే కాని మరే నమ్మకమూ, ఓదార్పు లేదు.

అధ్యాయం-14

జీవితం ఒక విడిది

ఈ విశాల విశ్వంలో ఏదీ అన్యమూ కాదు, అసాధ్యమూ కాదు. మానవుడు మహాశక్తిసంపన్నుడు. అన్నింటినీ అనుసంధానించుకోగలడు. ప్రమాదాల అగ్నిగుండాల్లో పయనిస్తూనే ఆత్మిక స్వరూపాన్ని నిర్మించుకోగలడు. బౌద్ధిక సుడిగుండాల్లో ఆరితేరి భౌతికంగా బూడిద కాగలడు.

పరిణామాత్మక జీవితానికి ఎప్పుడూ పరిధులు ఉండవ్. పైనుండి నింగి నీడలా కొమ్ముకాస్తుంటే కిందనున్న భూమి బడలిక తీరుస్తుంది.. ఉన్నదానిపై ఆశ లేనప్పుడే అది పోతుందనే భయం ఉండదు. ఆశపడే అవకాశమే లేకపోతే ఇక ఆశించే అవసరం ఉండదు. అదే మనకి గొప్ప ధైర్యాన్ని ఇస్తుంది. అసాధారణ స్థైర్యాన్నిస్తుంది. ప్రధానమంత్రుల్ని, మహారాజుల్ని 'ఛీ' కొట్టిస్తుంది. హెచ్.జి. వెల్స్ భాషలో చెప్పాలంటే ప్రతి ఒక్కరూ అహంకారి కాగలరు, మందిని తులనాడగలరు, దేవుడ్ని ధిక్కరించగలరు. ఏదెదురొచ్చినా సరే, పోయేదేం లేదు. అలాంటి వాతావరణాన్నే నేను శ్వాసించాను. ఏమీ లేనితనం నుండి వచ్చిన వాతావరణం. పాఠకుడా, నన్ను భరించు.

ఆస్తీ అంతస్తులు ఏవీ లేకుండా ఈ దేశంలో ఎటునుంచి ఎటైనా నేను తిరగ్గలను. పాస్‌పోర్టు వీసాలుంటే చాలు ప్రపంచమంతా అలాగే పరిభ్రమించగలను. సౌరకుటుంబంలోకి దూసుకుపోయే క్షిపణిలో సీటు రిజర్వు చేసుకోగలను. కానీ, ఇవన్నీ దేనికోసం?

నాది ఇప్పటికీ ఆకర్షణీయమయిన జీవితమే. ఇంకా నూటొక్క విషయాల్లో ఆసక్తి కనబరచడానికి చూస్తూనే ఉంటాను. నా గుండె చప్పుడు వినిపించేంత బలంగా భూమండలంపై పాదముద్రలు వేస్తుంటాను. అన్నీ సాధ్యమైనంత సరిగానే చేయడానికి ప్రయత్నించాను. నమ్మాను కాబట్టే కలలు కన్నాను. నన్ను నేను ఉత్సాహపరుచుకోడానికి ఇంకా పనిచేస్తూ ఆటలాడుతూనే ఉంటాను. కానీ, నేనేదీ ఆశించలేను.

జీవితం ఎలా వచ్చిందో అలాగే స్వీకరించాను. అలాగే పోరాడాను. చేయ గలిగినప్పుడు స్వారీ చేసాను. లేనప్పుడు ఎదురుదెబ్బలు తిన్నాను. దెబ్బలంటూ తగిలాక బాధ కలుగుతుంది. ఇప్పుడు ఆ నొప్పికి కూడా అలవాటు పడ్డాను. కాదంటారా?

సోమరిగా సంతోషాలు, సంచారిగా ఆలోచనలు ఇవే నాకు మిగిలిన స్మృతులు బుద్దుడికి దీక్షా వస్త్రాల్లాగా.

అధ్యాయం-15

దేవుడు కాపాడిన ఓడ

జీవితంలోని అల్లకల్లోలాన్ని మినహాయిస్తే నాకంటూ కొన్ని ఆదర్శాలు, ఆలోచనలు మిగిలాయి. మనిషి అత్యంత ప్రతిభ కల జీవి. పోలీసులు కొట్టే థర్డ్‌డిగ్రీ వంటి దెబ్బలు దేహాన్ని మనసునీ వేధించినా వాట్ని మళ్ళించి ముందుకు సాగిపోతాడు. ఒక చైనా తత్వవేత్త అన్నట్లు, నా వాదన ఏమిటంటే ఎవరికీ కూడా తీర్చబడని కష్టం, పూడ్చబడని నష్టం వంటివి ఉండవు. ఒకవేళ ఉంటే దేవుడు సాయం చేస్తాడు.

నా ఆలోచనలు, అభిప్రాయాలు అమూల్యమయినవి. వాట్ని నా నుండి ఎవరూ లాక్కోలేరనేదే సంతోషకరమైన సంగతి. నేనో సాంప్రదాయేతర వ్యక్తిని. వింత మనిషిని. సదాచార పారాయణుల దృష్టిలో చెడ్డవాడ్ని. నా మాటలు, చేతలు, అభిప్రాయాలు, ఆలోచనలు అందుకే భిన్నంగా ఉన్నట్టుంటాయి. వీటి వల్ల సంతోషమొచ్చినా, బాధ కలిగినా, నాపై పువ్వులు చల్లినా, రాళ్లు రువ్వినా నాకేం పట్టదు. విలువల్ని నేను సాపేక్షమంటాను. వాటిల్లో మంచివీ చెడువీ ఉన్నా, ఎవరేమనుకున్నా సరే, ఇదే నా విడిది. అదే దాని నిడివి.

ఆలోచనలన్నింటినీ భాష వ్యక్తపరచలేదు. అందుకే అనుభూతుల అభివ్యక్తికి భాషనేది ఓ పెద్ద అడ్డంకి. అందమైనదైనా, వికారమయినదయినా కొద్దోగొప్పో అర్థం చేసుకునే వేదికనే కోరుకుంటాను కానీ నీతిసూత్రాలు, మేధోవైపరీత్యాల చోటుని కాదు. అస్తమాను అసత్యంలో బతకడంకంటే, నేను సత్యాన్ని ప్రేమిస్తాను. ఆహా, అజ్ఞానం ఎంత ఆనందదాయకం, కానీ అది ప్రమాదకరమయిన ఆనందం!

ఒకసారి సత్యం, అహింసలపై గాంధీగారి మాటల్ని కూడా అవసరమయితే ధిక్కరించడమే సత్యానికి ప్రమాణమని అమెరికాలోని ప్రసిద్ధ రాజకీయనేత బెయార్డ్ రస్టిన్‌తో అనేసరికి ఒళ్ళు జలదరించినాయన అప్పటికప్పుడే నన్ను అమెరికాలో పర్యటిస్తూ ఉపన్యాసాలివ్వడానికి ఆహ్వానించాడు.

జీవితంలో మంచి సంగతులన్నీ సంతోషించడం కోసం ఉన్నవే. ఐతే అలా అవసరమయిన వాట్ని చేయకుండా మనమే సంతోషించలేకపోతున్నాం. సెక్సనేది జీవితంలో అందమయిన పని మాత్రమే కాదు, అదందరికీ చాలా అవసరమైనదని నా నమ్మకం. మన పూర్వీకులయిన కోతులు మాత్రమే కాదు డార్విన్ పరిణామంలోని ప్రతీ తరహాకి అదో జీవేచ్ఛ. ఐతే ఎందులోనయినా అతి అనేది అనర్థమే.

ఒక పిట్టకథుంది. జీవితాంతం పరమ పవిత్రంగా గడిపిన ఒక సన్యాసిని చనిపోయి పరలోకానికెళ్ళిందట. దేవుడు, ఏం కావాలని ప్రశ్నించాడట. దానికామె 'స్వర్గం' అని బదులిచ్చిందట. ఆశ్చర్యపోయిన దేవుడు 'ఎందుకు' అనడిగాడట. దానికామె, "నేను యవ్వనంలో ఉండగానే భర్త చనిపోయాడు. ఐనా జీవితాంతం వితంతువుగా పవిత్రంగా గడిపానే తప్పా ఏ మగాడితోనూ పడుకోలేదం"ది. ఆది మానవుడయిన ఆడంపై

అమితమయిన నమ్మకంతో దేవుడు తనని కటాక్షిస్తాడనుకుంది, పాము వల్ల పాపం చేసిన స్త్రీ ప్రతినిధి. 'మానవుడి మొదటి మహాధిక్కారం', పాపం మిల్టన్! అప్పుడు దేవుడు ఆమెతో "అయ్యో ఎంత దుర్భరం! ఇప్పుడు నువ్విక్కడ నాతో స్వర్గంలో ఉండి ఏం చేస్తావు మరి?" అని ప్రశ్నించాడు. ఆ భక్తురాలు దిగాలుగా వెళ్ళిపోతూ గొణుక్కుంది, "ఈ విషయం నాకు ముందుగానే తెలిస్తే కదా!"

ఎవరి జీవితాన్నీ కాలరాసే హక్కు మరొకరికి లేదని నాకు బలమైన అభిప్రాయం. రాజ్యానికి కూడా. ఒక హత్య ప్రభుత్వంచేతనో, ఒక బృందం చేతనో చేయబడినంతలో అది హత్య కాకుండా పోదు కదా. దోస్తవిస్కీ 'ఇడియట్'లో మర్నాడు ఉరితీసి చంపబోయే వ్యక్తి మొహంలో కనిపించే ఆ విభ్రాంతి, ఆ వేదనల చిత్రణ నేనెప్పటికీ మర్చిపోలేను.

జంతువుల్ని చంపడం కూడా నాకు నచ్చేది కాదు. కానీ అడివి ఆకర్షణలకి గురయ్యి అమాయికంగా నా కళ్ళలో కళ్ళు పెట్టి దీనంగా వేడుకుంటున్నట్లు చూసిన లేడిపిల్ల తుపాకి గుండుకి నేలకూలి చనిపోవడం నన్నెంతగా కలవరపరిచిందో. ఆనాటి నా కన్నీటి చారలింకా తడిగానే ఉన్నాయి!

నా మిత్రుడయిన మైసూరు మహారాజు ఒక పొగరుబోతు గజాన్ని చంపాలని అడివికి వెళ్ళాడట. ఆ ఏనుగు కనిపించగానే తుపాకి సూటిగా గురిపెట్టాడట. అప్పటిదాకా ఆ ఏనుగులో కనిపించిన క్రోధం కాకుండా, దాని మెదడు చిద్రం చెయ్యాలనే తలంపుతో ట్రిగ్గర్ నొక్కబోతున్న రాజుకి విచిత్రమయినొక భావన కలిగిందట. చాలాసేపు రాజుగారు ఆ ఏనుగూ ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుని ఏదో ఒప్పందానికి వచ్చినట్లు చెరోవైపూ వెళ్ళిపోయారట. తర్వాత ఆశ్చర్యకరంగా ఈ ఏనుగు ఏ ఒక్కరిమీదా, గ్రామాల మీదా దాడి చేయలేదట. చాలాసార్లు సౌమ్యంగా కనబడేదట. మదగజంతో తానెలా మానవీయ సంబంధాన్ని ఏర్పర్చుకోగలిగారో ఇదంతా ఆయనే నాకు వివరించారు.

ఒకసారి గవర్నరు, సాంస్కృతిక శాఖామాత్యుడు, ఆరోగ్యశాఖ మంత్రి, ఢిల్లీ ప్రముఖులు, మహారాజా అంతా విందులో ఉండగా, రాజుగార్ని గవర్నరు గారు 'అతి క్రూరమైన, భయంకర జంతువు ఏమిటని' అడిగారు. బెబ్బులనో, మదగజమనో అలాంటిదేదో చెప్పారు. నేను కలగజేసుకుని, 'రాజకీయ నాయకుడు వీటికంటే భయంకరం అని తెల్సి కూడా మీరు కాల్చలేరు' అన్నాను. ఒక్క క్షణం నిశ్శబ్దం. మరుక్షణం బిగ్గర కేకలు, నవ్వులు.

ఎంతోమందిపై దాడిచేసిన మరో క్రూరమైన ఏనుగు బరోడా మహరాజు తూటాకి నేలకూలింది. బహుశా ఈ ఏనుగు అంత మానవత కలిగింది కాదేమో!

ఆత్మహత్యని చట్టబద్ధం చేయాలనేది నా అభిప్రాయం. ఒకరికి సరయినదిగా అనిపించినప్పుడు నిష్క్రమించే హక్కు, స్వేచ్ఛ ఎందుకుండకూడదు? బాధలకి, వేదనలకి ముగింపు మార్గాన్ని ఎన్నుకున్న వారి నిర్ణయాన్ని నిరోధించడం, కట్టడి చేయడం ఎందుకు? పుట్టుక – చావులు రెండూ బహుశా వాటికవి అంత ప్రాధాన్యత కలవి కాదు, పరిస్థితులే అసలు విషయం. అందుకే, నేనిలా సాగుతున్నాను. ఇలా బతుకుతున్నాను.

అధ్యాయం-16

అజ్ఞాత గమ్యం

విశ్వాంతరాల్లోని కక్ష్యల్ని కూడా క్షిపణులు ఛేదించగలవు. అనూహ్యమైన అగ్ని గోళాల్ని అణుబాంబులు సృష్టించగలవు. ప్రపంచాధినేతలంతా శిఖరాగ్ర సమావేశాల్లో ములిగిపోయున్నారు. వారిక ఇంటికెళ్లే సూచనలు కనిపించడం లేదు! సూపర్‌సోనిక్ విమానాల వేగం కాంతి మార్గాల్ని భయపెడుతోంది. దూరాలు ఛేదించబడ్డాయి. భావాలు భేదించబడ్డాయి. సౌభ్రాతత్వంతో కూడిన ఒక ప్రపంచ ప్రభుత్వం కోసం ప్రయత్నాలు తలెత్తాయి.

మానవులంతా విశ్వానికి వారసులే. ఒక గొప్ప జీవితం, గొప్ప సంస్కృతి, సరిహద్దుల్లేని సర్వమానవ కళ్యాణజగత్తు!

అప్పుడిక స్వార్థ సంకుచితత్వాలకీ, కాలం చెల్లిన అహంభావాలకీ ఆస్కారం ఉండదు. నూతన సత్యాలు మాత్రమే ఆవిష్కరింపబడతాయ్. బహుశా ఒక కొత్త తరహా మానవుడు ఉద్భవించే మరో ప్రపంచం అదేనేమో?

మూత తీసినట్టున్న ఈ భవిష్యత్ దర్శినిలో నుంచి మహనీయుడయిన మానవుడి ఆగమనాన్ని నేను లీలగా చూడగలుగుతున్నాను. అనంత కాలవాహినిలో ప్రస్తానపు జాడల్ని పసిగట్టి ఆ నా అస్తిత్వానికి ఆద్యంతాలు నిర్ణయించి, దానికి జీవితమనే సార్థక నామకరణం చేసాను.

నేను వెళ్ళిపోవచ్చు లేదా వేచి ఉండచ్చు. నేనే కదలచ్చు, లేదా అదే రావచ్చు. ఈ కథ ఇక్కడికి అంతమవ్వచ్చు. ఇదే ఆరంభమూ కావచ్చు. ఏదేమయినా ప్రతీది చలనంలో కలిసేదే. ఘటనల సమాహారంగా సంఘటనల్లో చేరేదే. అజరామర ప్రవాహంలో అజ్ఞాత గమ్యంగా నిలిచేదే.

సోక్రటీస్ పాదాలకి ప్రణమిల్లి పదే పదే ప్రకటిస్తున్నాను, 'నాకు ఏమీ తెలీదు. అస్సలేమీ తెలీదు.'

దేనిమీదా నాకు ద్వేషం లేదు. అయిష్టత ఏ కొద్ది వాటి మీదో తప్పలేదు. మానవత్వం అంటే నాకు ఇష్టం. అయినా కొందరినే ప్రేమించగలిగాను. ప్రేమని కొందరికే పంచగలిగాను.

మీ ముందు నా మనసు తెరలు దించే సమయం వచ్చింది. ఎన్నో విషయాలకి సంబంధించిన నిర్విరామ ఆలోచనలు నన్ను చుట్టుముడుతున్నాయి. హైందవ ప్రార్థనా వాక్యం నా మనసులోంచి జ్ఞప్తికొచ్చింది. ఆ ఉపదేశం,

'సర్వలోకాః సుఖినోభవంతు!'

ఒక అనుభవం

విచ్చుకుంటున్న
విస్తారమైన, వృద్ధవుతున్న,
నిత్యనూతనమయిన వాల్ట్‌విట్‌మెన్ విశ్వంలోనికి,
అన్నీ చూసి, అనుభూతి చెంది, నిజంగా అన్నింటిలా మారి
అత్యున్నత మానవుడి ఔన్నత్యం అనంతమయిన గమ్యం నుండి
నాలో ఆవిర్భవిస్తున్న ఆనందపు లోతుల్లో
ఒక్కడిగా పరవశంతో ఘనీభవించాను.